

అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31 (బుధవారం)
కనిష్ఠం : 27

బ్యారేజ్..డామేజ్!

● అస్తవ్యస్తంగా కాటన్ బ్యారేజీ నిర్వహణ 7





కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో యోగా చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిశాంతి

జీవనశైలిలో మార్పులకు యోగాయే పరిష్కార మార్గం

» కలెక్టర్ మహేష్‌కుమార్ పిలుపు » కలెక్టరేట్‌లో యోగా మాసోత్సవాలు ప్రారంభం

అమలాపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవనశైలిలో వస్తున్న మార్పుల పరిష్కారానికి యోగాసనాలు ఎంతో ఉపకరిస్తాయని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. అమలాపురంలోని కలెక్టరేట్‌లో బుధవారం చేపట్టిన యోగాంధ్ర-2025ను పురస్కరించుకుని నెలరోజులపాటు నిర్వహించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి గోదావరి భవన్‌లో యోగసనాలు వేశారు. దేశ వారసత్వమైన యోగా విశిష్ట ప్రక్రియను ప్రతీ ఇంట్లో అనుసరించి సంపూర్ణ ఆరోగ్యం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. శాస్త్రీయ ఆధారాల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా యోగాకు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. ఐక్య రాజ్యసమితి నిర్ణయం మేరకు జూన్ 21న జరిగే ప్రపంచ యోగా దినోత్సవం వరకు ఈ నెల రోజులపాటు ప్రతీ కుటుంబంలోను యోగా, ధ్యానం చేయాల్సిందిగా పలువురు ఉద్బోధించారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సును సాధించేందుకు చక్కటి పరిష్కార మార్గమే యోగా అభ్యాసమని పేర్కొన్నారు. బహుళ ప్రయోజనాలు సమకూర్చే ఈ ప్రక్రియ వ్యాయామం, శ్వాసక్రియ, జ్ఞానం అనే మూడు ప్రధాన అంశాలపై ఆధారపడి ఉంటాయన్నారు. యోగా మాసోత్సవాల్లో భాగంగా మే 27న ప్రజా ర్యాలీ, 28న మండల స్థాయిలో ప్రజాప్రతినిధులతో కలిసి ర్యాలీ, జూన్ 4న మున్సిపల్ గ్రామస్థాయిలో ర్యాలీలు ఉంటాయి. 5 నుంచి 14వ తేదీ వరకు స్వయం సహాయక సంఘాలు, స్టూడెంట్స్, సీనియర్ సిటిజన్లకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రసాద్, డీఆర్వో రాజకుమారి, యోగామాస్టర్ దుర్గాప్రసాద్, ఆర్డీవో కె.మాధవి, ఓంశాంతి ప్రతినిధులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో జరిగిన యోగా కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు

డివిజన్	పెద్దాపురం	కాకినాడ	అమలాపురం	రాజమహేంద్రవరం
ఎకరాలు	2,268	553	795	412

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భూదాన భూముల రైతుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. భూమిపై హక్కు ఉన్నా ఆన్‌లైన్‌లో మార్పులు చేర్పులు జరగక..ఏ పథకాలు వర్తిం చక నానా తంటాలు పడుతున్నారు. అటు భూదాన బోర్డు పట్టించుకోక.. రెవెన్యూ అధికారులు సంబంధం లేదని వదిలేస్తుండడంతో నరకయాతన పడుతున్నారు. తమ సమస్య పరిష్కారానికి ఏం చేయాలో తెలియక సతమత మవుతున్నారు.ఎప్పుడో తాతల పేరున, తండ్రుల పేరునా ఉన్న రికార్డులే నేటికి ఆన్‌లైన్‌లో దర్శనమిస్తుండడంతో వాటిని తమ పేరున బదిలీ చేయించుకోవడానికి కాళ్లరిగేలా తిరుగుతున్నారు.





భూదాన బోర్డు భూములు

భూ..తాన్!

రైతుల పాలిట భూతంగా భూదాన భూములు

» భూదాన్ భూముల అగచాట్లు
» హక్కు ఉన్నా పథకాలకు దూరం
» ఆన్‌లైన్‌లో మార్పులు చేర్పుల్లేవ్
» పాతికేళ్లుగా ఎదురుచూపులు
» ఉమ్మడి జిల్లాలో 4,211 ఎకరాలు
» అధికారులకు రైతుల మొర
» చనిపోయినా రికార్డుల్లోనే..
» రీసర్వేలోను అదే తీరు
» కళ్లెదుట భూమి..కాగితాల్లో లేదు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భూదాన యజ్ఞబోర్డు ఉండేది. ఇది భూదాన రైతులకు పట్టాలను మంజూరు చేసేది. ఈ బోర్డు నుంచి పట్టా తెచ్చుకున్న వారికి వారి పేరున అప్పట్లో ఆన్‌లైన్‌లో నమోదు చేసి పాస్ పుస్తకాలను సైతం రెవెన్యూ అధికారులు మంజూరు చేసేవారు. ఆ తర్వాత భూదాన్ బోర్డును తొలగించడంతో గతంలో ఎవరైతే ఆన్‌లైన్‌లో ఉన్నారో వారి పేరునే నేటికీ ఆన్‌లైన్‌లో భూమి చూపిస్తోంది. వీరి వారసులు, వారి నుంచి కొనుగోలు చేసుకున్న రైతుల పేర్లు మాత్రం ఎన్నో ఏళ్లుగా ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదు. దీంతో వీరికి ఏ పథకాలు వర్తించడం లేదు. తమ తండ్రి చనిపోవడంతో వారసుడిగా తమ పేరును ఆన్‌లైన్‌లో గుర్తించాలంటూ వేలాది మంది అన్నదాతలు ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ అధికారులకు ఎన్నోసార్లు వినతిపత్రాలు అందించారు. అయినా ఇప్పటికీ ఫలితం ఉండడం లేదు. భూదాన బోర్డు నుంచి ఆ భూమి తమదేనంటూ పత్రం మంజూరు చేయించుకుంటే తప్పించి తాము ఏం చేయలేమని అధికారులు తెగేసి చెప్పేస్తున్నారు. చాలామంది రైతులకు అసలు భూదాన బోర్డు, రైతు చట్టాల పై అవగాహన లేదు.కొంత కాలంగా అధికారులు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటుచేసి భూసమస్యల పరిష్కారానికి ముందుకు వచ్చారు. ఇవేవీ అన్నదాతల సమస్యలు పరిష్కరించలేదు. కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పలువురు రైతులు మాట్లాడుతూ పాతికేళ్ల నుంచీ తమ కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయని కన్నీటి పర్యంతమవుతున్నారు.

రీ సర్వేలోనూ అంతే...

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో భూముల రీసర్వే జరుగుతోంది. రీసర్వే ద్వారా తమకు హక్కులు లభిస్తాయని, పాతికేళ్ల కింద ఉన్న పేర్లకు బదులు వారసులుగా తమ పేర్లు ఆన్‌లైన్ అవుతాయని అన్నదాతలు భావించారు. కానీ రీసర్వేలో సైతం అధికారులు ఆ భూములు పాత యజమాని పేరునే గుర్తిస్తున్నారు. అదే సమయంలో ప్రస్తుతం సాగులో ఉన్న రైతు పేర్లను ప్రస్తావిస్తూ భూదాన అధికారులకు పంపుతున్నారు. ప్రస్తుత వారసులు తమ పేరున ఆన్‌లైన్ చేయాలని అర్జీలు ఇస్తున్నా భూదాన అధికారులు నిర్ణయం తీసుకోవాలని చెబుతున్నారు. దీంతో తమకు ఎప్పుడు హక్కులు వస్తాయో తెలియక వీరంతా దిగులు చెందుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూదాన బోర్డు భూములను అప్పటి అధికార పార్టీ పెద్దలు కొందరు అడ్డగోలుగా తమ పేరున ఆన్‌లైన్ చేయించేసుకున్నారు. తమ పలుకుబడి ఉపయోగించి

వారసులకు హక్కుల్లేవ్..

గతంలో ప్రభుత్వాలు భూదాన భూములను రిజిస్ట్రేషన్ చేసుకునే వేసులు బాటును కల్పించగా 2000 సంవత్సరం నుంచి నిలిపివేశాయి. ఆ తర్వాత వారసులు వీటిని తమ పేరుపై మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్నా కుదరడం లేదు. ఈ నేపథ్యంలో 4,211 ఎకరాల్లో పాతికేళ్ల కిందట రికార్డుల్లో ఉన్న రైతుల పేర్లే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. చనిపోయిన వారి స్థానంలో వారసుల పేర్లను సైతం తాజా రీసర్వేలోను గుర్తించడం లేదు. దీంతో వీరంతా తమ గోడు వినాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గత ప్రభుత్వంలో కొందరు పెద్దలు మాత్రం భూదాన భూములను పరపతితో ఆన్‌లైన్ చేయించేసుకున్నారు. సామాన్య రైతులు దిక్కుతోచని స్థితి ఎదుర్కొంటున్నారు. భూదాన బోర్డు భూములను పూర్వం నుంచీ సాగు చేసుకుంటున్న రైతులకు, వారి వారసులకు భూమిపై హక్కు కల్పించాలని అన్నదాతలు కోరుతున్నారు. ప్రస్తుతం పెద్దాపురం రెవెన్యూ డివిజన్‌లో 2,268 ఎకరాలు, కాకినాడ డివిజన్‌లో 553, అమలాపురం డివిజన్‌లో 795, రాజమహేంద్రవరంలో 413 ఎకరాలు, రంపచోడవరం డివిజన్‌లో 179 ఎకరాలు, కొవ్వూరులో ఇదేవిధంగా భూదాన భూములు ఉన్నాయి. వీటిలో దాదాపు అన్నింటికి అప్పట్లో పట్టాలిచ్చేశారు. వీటిని అనుభవిస్తున్న రైతులకు సంబంధించి వారసులకు హక్కులు లేకపోవడం ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది.

అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ల ద్వారా పదుల కొద్దీ ఎకరాల భూమిపై యాజమాన్య హక్కులు పొందారు. అప్పుడు ఇద్దరు కలెక్టర్లు అడ్డగోలుగా వ్యవహరించారు. పాతికేళ్ల కింద ఆక్రమించిన, కొనుగోలు చేసిన వాటిని ఇష్టానుసారం తమ పేరుపై బదిలీ చేయించేసుకుని హక్కులు పొందారు. కోనసీమ జిల్లా రామచంద్రపురం, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఉన్నట్టు సమాచారం. సామాన్య రైతుల గోడు మాత్రం ఎవరూ వినడం లేదు. 2000 ఏడాదికి ముందు కొనుగోలుచేసిన యజమానులు సైతం అర్జీలతో ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

పోస్టులు 1241

దరఖాస్తులు 63,004



» తూర్పున డీఎస్సీకి తీవ్ర పోటీ
» ఒక్కో ఉద్యోగానికి 50 మంది
» ఉమ్మడి జిల్లాలో పోస్టులు తక్కువ
» వెల్లువెత్తిన దరఖాస్తులు
» పరీక్షకు 38,617 మంది
» జూన్ 6 నుంచి పరీక్షలు

కాకినాడ రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీకి దరఖాస్తులు పోటెత్తాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల డీఎస్సీ పోస్టులు భర్తీ చేయలేదు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ నిరుద్యోగులు లక్షలాదిగా పెరిగిపోయారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా డీఎస్సీకి అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. అన్ని మేనేజ్‌మెంట్లకు కలిపి 1241 పోస్టులుండగా, 63,004 దరఖాస్తులు వచ్చాయని అధికారులు వెల్లడించారు. ఒక్కో పోస్టుకు సగటున 50 దరఖాస్తులు రావడంతో అభ్యర్థుల మధ్య తీవ్రపోటీ నెలకొంది. కొలువు కొట్టాలంటే కష్టపడాల్సిందేనని నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు అనుకుంటున్నారు.

15తో ముగిసిన గడువు

డీఎస్సీ నోటిఫికేషన్‌కు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి 63,004 దరఖాస్తులు వచ్చాయి. 38,617 మంది అభ్యర్థులు దరఖాస్తుచేసుకోగా 14,380 మంది పురుషులు, 24,237 మంది మహిళలు ఉన్నారు. దరఖాస్తుల నమోదులో మహిళలే టాప్‌గా ఉండడం విశేషం. కేటగిరీల వారీగా ఓసీ 5,120, బీసీ-ఏ 2,810, బీసీ-బీ 6,991, బీసీ-సీ 554, బీసీ-డీ 3,636, బీసీ-ఈ 568, ఎస్సీ గ్రేడ్-1 87, ఎస్సీ గ్రేడ్-2 2,572, ఎస్సీ గ్రేడ్-3 10,066, ఎస్టీ-6,213, ఈడబ్ల్యూఎస్ 3,782, అలాగే దివ్యాంగుల కేటగిరీ నుంచి వీఎచ్ 159, హెచ్‌హెచ్ 36, ఓహెచ్ 847, ఎంఐ 6 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 15తో ముగిసింది. 20 నుంచి మాక్ టెస్టులు నిర్వహిస్తున్నారు. హాల్ టికెట్లను ఈనెల 30 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూన్ 6 నుంచి జూలై 6 వరకూ ఆయా కేటగిరీల వారీగా సీబీటీ విధానంలో పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షల నిర్వహణ అనంతరం ప్రాథమిక కీ విడుదల, అభ్యంతరాల స్వీకరణ, తుది కీ విడుదలచేసి మెరిట్ జాబితా ప్రకటించనున్నారు.

ఉద్యోగాల వివరాలివీ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1,241 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీచేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్ 608, పీఈటీలు 210, ఎస్జీటీ 423 పోస్టులు ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు తెలుగు 65,హిందీ 78, ఆంగ్లం 95, గణితం 64, ఫిజికల్ సైన్స్ 71, బయోలాజికల్ సైన్స్ 103, సోషల్ 132, వ్యాయామ విద్య 210 ఉద్యోగాలతోపాటు 423 సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ ఉద్యోగాలు ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమకు సంబంధించి ఫిజికల్ సైన్స్ 3, బయోలాజికల్ సైన్స్ 4, స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య 1, ఎస్జీటీలు 104 మొత్తం 112 ఉద్యోగాలను భర్తీచేయనున్నారు. ప్రత్యేక విద్యకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 13 టీజీటీలు, 3 పీఈటీలు, 15 ఎస్జీటీలతో కలిపి 31 పోస్టులు భర్తీకానున్నాయి. జోన్ 2 (ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా)కి సంబంధించి ఏపీఆర్ఎస్, ఏపీఎంఎస్, ఏపీఎస్‌డబ్ల్యూ, బీసీ, సోషల్ వెల్ఫేర్‌కు సంబంధించి పీజీటీ 49, టీజీటీ 272, పీడీ3, పీఈటీ 24లతో కలిపి మొత్తం 348 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీచేయనున్నారు. ఇక డీఎస్సీకి దరఖాస్తుచేసుకున్నవారిలో మహిళా అభ్యర్థులే ఎక్కువ.

నేడు అమలాపురంలో జిల్లా మహానాడు

ముఖ్య అతిథిగా అచ్చెన్నాయుడు

అమలాపురం/ఆత్రేయపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అమలాపురంలో జిల్లా స్థాయి మహానాడును గురువారం నిర్వహించనున్నారు. స్థానిక కాపునాడు కల్యాణ మండపంలో గురువారం మధ్యాహ్నం జరగనున్న జిల్లాస్థాయి మహానాడుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హాజరు కానున్నారు. జిల్లాకు చెందిన కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌తోపాటు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ఇతర టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులు సమావేశంలో పాల్గొనున్నారు. మహానాడు సందర్భంగా జిల్లా స్థాయిలో జరిగే కార్యక్రమాన్ని టీడీపీ శ్రేణులు విజయవంతం చేయాలని స్థానిక నాయకులు కోరారు. కాగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు గురువారం ఉదయం 11.30 ఆత్రేయపురం రానున్నారు. వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోనున్నారు. అలాగే ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు.

గుడిమెల్లంక మంచినీటి పథకానికి రూ.5 కోట్లతో రెండో ఆర్ఎస్ఎఫ్

మలికిపురం,మే21(ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలం గుడిమెల్లంక రక్షిత మంచినీటి పథకానికి ఓఎన్జీసీ సీఎస్సార్ నిధుల నుంచి రూ.5 కోట్లు మంజూరైనట్టు రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ తెలిపారు. ఈ నిధులతో రెండో ఆర్ఎస్ఎఫ్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీంతో 98 ఆవాస ప్రాంతాలకు మంచినీటి సరఫరాలో ఇబ్బందులు తొలగుతాయన్నారు. ప్రస్తుతం ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్ పనిచేస్తుందని, రెండో ఫిల్టర్ ఏర్పాటు ద్వారా మంచినీటి సమస్యలకు పరిష్కారం దొరికినట్టేనన్నారు. రిజర్వాయర్ వద్ద ఇప్పటికే 60కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు.

జిల్లాల పునర్వ్యవస్థీకరణపై ప్రభుత్వం కసరత్తు?

» మండపేట అసెంబ్లీని తూర్పులో విలీనం చేయాలి
» తాళ్లరేవు, కాజులూరును కోనసీమలో కలపాలి
» అముడాను లోక్‌సభ పరిధికి విస్తరింపజేయాలి
» తాజాగా ప్రజల్లో ప్రారంభమైన చర్చలు

(అమలాపురం - ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఏర్పడ్డ నూతన జిల్లాలను మళ్లీ పునర్వ్యవస్థీకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో కొత్తగా ఆవిర్భవించిన జిల్లాల్లో చేర్పులు, మార్పులపై ఊహాగానాలు మొదలయ్యాయి. ఉద్యమాలు కూడా చేపట్టేందుకు వివిధ రాజకీయ పక్షాల నేతలు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే తమ ప్రాంతాలను పక్క జిల్లాలో కలపాలంటూ ప్రభుత్వానికి తీర్మానాలు చేసి పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆవిర్భావ సమయంలో గత వైసీపీ ప్రభుత్వం కొన్ని మండలాలను పక్క జిల్లాల్లో కలుపుతూ తీసుకున్న నిర్ణయాన్ని మళ్లీ పునఃసమీక్షించాలంటూ ప్రజలు గళం విప్పుతున్నారు. దీనికితోడు సార్వత్రిక ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచార సమయంలో కొత్త జిల్లాల ఏర్పాటులో ఉన్న లోపాలను ప్రసంగాల్లో ప్రస్తావించడం ద్వారా వాటిని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సరి చేస్తానంటూ సభల్లో హామీలిచ్చారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల కిందట జరిగిన మంత్రిమండలి సమావేశంలో జిల్లాల పునర్విభజనలో లోపాలను సరిదిద్దేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అమలాపురం ఎస్సీ రిజర్వుడు లోక్‌సభ నియోజకవర్గ పరిధిని అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా పరిగణించాలనేది కొందరు ముఖ్యనేతల వాదన. ఎందుకంటే ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తాళ్లరేవు మండలాన్ని పక్కనే ఉన్న కాకినాడ జిల్లాలో గత ప్రభుత్వం కలిపింది. అదేవిధంగా రామచంద్రపురం నియోజకవర్గంలోని కాలుజూరు మండలాన్ని కాకినాడ జిల్లాలో కలిపింది. అయితే ఈ రెండు మండలాలను తిరిగి అమలాపురం లోక్‌సభ పరిధిలోకి వచ్చే కోనసీమ జిల్లాలో విలీనం చేయడం వల్ల తాళ్లరేవు పరిధిలోని చమురు సంస్థలైన రిలయన్స్, జీఎస్‌పీఎస్ నుంచి భారీగా సీఎస్ఆర్ నిధులు జిల్లా అభివృద్ధికి దోహద పడతాయనే వాదనతో వాటిని ఈ ప్రాంతంలో కలపాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. అలాగే మండపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్న వివిధ మండలాలను పక్కనే ఉన్న తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గత కొంతకాలం నుంచి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల సమయంలోను ప్రజలకు హామీ కూడా ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ మార్పు చేయిస్తానని జోగేశ్వరరావు చేసిన ప్రకటన ఇప్పుడు ప్రభుత్వం చేసిన ప్రకటనతో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే ఇటీవల జరిగిన నియోజకవర్గస్థాయి మహానాడులో మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబును కోరుతూ తీర్మానం కూడా ఆమోదించారు. అదే జిల్లా మహానాడులో కూడా ప్రస్తావించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. మండపేటను తూర్పుగోదావరిలో విలీనం చేయాలనే ప్రతిపాదనకు ఆమోద ముద్ర పడితే అమలాపురంలోక్‌సభ నియోజకవర్గం పరిధి విచ్ఛిన్నమై గందరగోళానికి దారితీసే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. కాకినాడ జిల్లాలో గతంలో విలీనం చేసిన తాళ్లరేవు, కాజులూరును కూడా కోనసీమ జిల్లా పరిధిలోకి తీసుకురావడంతోపాటు లోక్‌సభ నియోజకవర్గ ప్రాతిపదికన అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని కూడా విస్తరింప చేయాలని టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. కొన్ని మండలాలను రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్‌లో విలీనం చేయడంలో అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అభివృద్ధికి అవరోధం ఏర్పడుతుందనేది ఈ ప్రాంత ప్రజల వాదన. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న జిల్లాల పునర్విభజనలో ఆచితూచి అడుగులు వేయకపోతే మళ్లీ ఉద్యమాలకు ఊపిరిపోసిన వారవుతారని వివిధ పక్షాలకు చెందినవారు పేర్కొంటున్నారు.



ఐజీకి బొకే అందిస్తున్న జిల్లా ఎస్పీ బి కృష్ణారావు

కోనసీమలో 3 వేల సీసీ కెమెరాలు

ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ 7

పుష్కరాలకు వెళ్లొస్తూ తిరిగిరాని లోకాలకు..

లారీ ఢీకొని తల్లికొడుకు మృతి
మరో నలుగురికి తీవ్రగాయాలు
కొత్తగూడెంలో ఘటన, మృతులది అంబాజీపేట మండలం చిరతపూడి 7



సీఎం చంద్రబాబును కలిసిన ఎంపీ హరీష్


అఖిలపక్ష బృందంలో హరీష్‌కు అవకాశం

» ఈ నెల 24 నుంచి జూన్ 5 వరకు విదేశాల్లో పర్యటన
» ఉగ్రవాదుల వ్యతిరేక చర్యలపై భారత్ తరపున ప్రచారం
» సీఎం చంద్రబాబును కలిసి కృతజ్ఞత తెలిపిన ఎంపీ హరీష్

అమలాపురం, మే 21(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల వ్యతిరేక చర్యలను భారత్ తరపున ప్రపంచ దేశాలకు తెలియజేసేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన అఖిల పక్షం బృందంలో అమలాపురం ఎస్సీ రిజర్వుడు లోక్‌సభ నియోజకవర్గ ఎంపీ, టీడీపీ పార్లమెంటరీ విప్ గంటి హరీష్‌బాలయోగికి అవకాశం లభించింది. ఎన్డీఏ ప్రభుత్వంలో యువతను ప్రోత్సహించడంలో ముందుండే ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబులు తీసుకున్న నిర్ణయంలో భాగంగా తనకు ఈ కమిటీలో స్థానం లభించడం అదృష్టంగా భావిస్తున్నానని హరీష్‌బాలయోగి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 33 దేశాల్లో భారత్‌లో ఇటీవల జరిగిన పెహల్గాం ఉగ్రదాడి, పాకిస్తాన్‌పై భారత్ తీసుకున్న నిర్ణయం వంటి అంశాలపై ఆయా దేశాల ప్రతినిధులకు వివరించే లక్ష్యంతో ఈ బృందం పది రోజులపాటు వివిధ దేశాల్లో పర్యటించనుంది. ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు పర్యటనలో ఎంపీ హరీష్ పాల్గొంటారని స్థానిక కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా చంద్రబాబును కలిసిన హరీష్ తనకు అఖిల పక్ష కమిటీలో అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

రీసర్వే దస్త్రాల డిజిటలైజేషన్‌తో భూవివాదాలకు అడ్డుకట్ట : జేసీ

అమలాపురం, మే21(ఆంధ్రజ్యోతి): రీసర్వే దస్త్రాల డిజిటలైజేషన్‌తోనే భూముల వివాదాలకు అడ్డుకట్ట పడుతుందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. వందేళ్ల తరువాత జరుగుతున్న భూముల సర్వే ప్రక్రియలో అధికారులు చాలా అప్రమత్తతో పనిచేయాలని, న్యాయపరమైన ఇబ్బందులు కూడా లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం అమరావతి నుంచి రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డిలు వివిధ జిల్లాల జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. రీసర్వే పైలెట్ ప్రాజెక్టు రెండో దశ పురోగతి ప్రాధాన్య అంశాలపై సమీక్షించారు. ప్రాజెక్టులకు భూ సేకరణ, ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు, భూముల క్రమబద్ధీకరణ, అందరికీ ఇళ్లు, నీటితీరువా వసూళ్లు వంటి అంశాలపై ఈ కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. సిబ్బంది కొరత, నిధులు సమస్యలను అధిగమించడంపై దృష్టిపెట్టి అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకునే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రీసర్వేతో భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో రాజకుమారి, ఆర్డీవోలు పి.శ్రీకర్, కె.మాధవి, డి.అఖిల, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కె.ప్రభాకర్, ఎస్టీసీ కృష్ణమూర్తి, ఏవో కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



కూరగాయలతో జీవ వైవిధ్యం

వెజిటబుల్ కార్వింగ్ కళతో తయారుచేసిన గోవిందరాజులు మాస్టారు

గొల్లప్రోలు రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): జీవ వైవిధ్యం గురించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు వెజిటబుల్ కార్వింగ్ కళ ద్వారా కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల పరిషత్ స్కూలు జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు తయారుచేసిన అంశాలు ఆకట్టుకుంటున్నాయి. ఆయన కాయగూరలపై రకరకాల జంతువులు, చెట్లను చెక్కారు. కాకరకాయలతో కప్ప, మొసలి, గుమ్మడికాయతో సముద్రపు గుర్రం, చేప, క్యారెట్‌లతో జాతీయ పక్షి నెమలి, తాబేలు, చెట్లు తయారు చేశారు. గురువారం అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వీటిని తయారు చేసినట్టు గోవిందరాజులు చెప్పారు.





వెజిటబుల్ కార్వింగ్‌తో చెక్కిన ఆకృతులను చూపుతున్న ఉపాధ్యాయుడు గోవిందరాజులు

చిత్ర వైవిధ్యం...



అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట సత్య ఆర్ట్ అకాడమీ విద్యార్థులు ముఖేష్, చక్రి, గౌతమ్ గీసిన పలు చిత్రాలు ఆలోచింపజేస్తున్నాయి. గురువారం జరిగే కార్యక్రమంలో వీటిని ప్రదర్శిస్తామని డ్రాయింగ్ టీచర్ మందపల్లి సత్యానందం చెప్పారు.

- మండపేట

కూత కోత



- రోజుకు ఐదు స్పెషల్ రైళ్లు
- ప్రతిరోజూ పలు రైళ్లు రద్దు
- ఎటెళ్లాలన్నా విపరీతమైన రద్దీ
- ఉమ్మడి జిల్లా ప్రయాణికులకు వేసవి సెలవుల్లో నరకమే

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రైల్వే తీరు చిత్రంగా ఉంది. ఓవైపు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామంటూ.. మరోవైపు నడుస్తున్న రైళ్లను రద్దు చేస్తోంది. దీంతో ప్రత్యేక రైళ్లలో కూడా బెర్తులు దొరక్క ఉమ్మడి తూర్పు గోదావరి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వేసవి సెలవులు మరో 20 రోజుల్లో ముగుస్తాయి. దీంతో ఇప్పటికే సెలవులకు చుట్టాల ఇళ్లకు, విహారానికి వెళ్లిన వాళ్లు ఇంటి ముఖం పట్టగా.. ఇప్పుడు సెలవులకు ఊరు విడిచి వెళ్లే వారూ ఉన్నారు. ఈ ప్రయాణికులతో రద్దీ ఎక్కువగా కనిపిస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ వైపు ప్రయాణాలు అధికంగా ఉన్నాయి. దీంతో పాటు బెంగళూరు కూడా ఎక్కువగా వెళ్తున్నారు. కేరళ, తమిళనాడు విహారానికి వెళ్లే వారికి రైళ్లలో ప్రస్తుతం బెర్తులు దొరకడం ఇబ్బంది అవుతోంది. రాజమహేంద్రవరం, కాకినాడ రైల్వే స్టేషన్ల గుండా సాధారణ రోజుల్లో రోజుకు సరాసరిన 50వేల మంది దాకా రాకపోకలు సాగిస్తుంటారు. వేసవి సెలవుల్లో ఆ రద్దీ మరో అంత ఉంటుంది. దీనికి అనుగుణంగా రైళ్లు లేకపోవడం, ఇంటర్ సిటీలు వేయడానికి రైల్వేకు నిబంధనాలు అడ్డువస్తుండడంతో ప్రయాణికులు అవస్థ పడుతున్నారు. అస్సోం, బెంగాల్, ఉత్తరాఖండ్, ఒడిశా వైపు నుంచి వచ్చే రైళ్లలో కాలుపెట్టడానికి కూడా వీలుండట్లేదు. లేదు. గౌతమి మినహా హైదరాబాద్‌కి ఏ రైలులోనూ ఉమ్మడి 'తూర్పు' ప్రయాణికులకు కోటా ఉండదు. దీంతో రాజమండ్రి నుంచి ప్రారంభమయ్యేలా రైళ్లు నడపాలనే డిమాండ్ పెరుగుతోంది. ఇక్కడి నుంచి వందే భారత్ ప్రకటించినా ఎప్పుడు పట్టాలెక్కుతుందో గుట్టుచప్పుడు కాకుండా ఉంది.

బెంగళూరు రైలులో వెళ్లాలంటే తత్కాల్ దొరికితే అదృష్టమే. స్లీపర్ సాధారణ రిజర్వేషన్లు చూస్తే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కి 23న వెయిటింగ్ లిస్టు 210, శేషాద్రికి 132 ఉంది. జూన్ 25 వరకు స్లీపర్ ఖాళీ లేవు. గురువారం నడిచే అంగ ఎక్స్‌ప్రెస్‌కి వెయిటింగ్ లిస్టు చూపెడుతుండగా.. హౌరా-బెంగళూరు రైలు జూన్ 2 వరకూ రిగ్రేట్ చెప్పేసింది. బెంగళూరుకు రోజుకు నాలుగైదు రైళ్లు నడుస్తుండగా.. వాటిలో మూడు మాత్రమే నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి.

● అవి వేసి.. ఇవి రద్దు

ఆపరేషనల్, మెయింటెన్స్ ఇలా రకరకాల కారణాలతో తరచుగా రైళ్లను రద్దు చేస్తున్నారు. రైళ్లు ఆలస్యంగా నడవడం పరిపాటే. అయితే ఇప్పుడు రైలు వచ్చి మనం ఎక్కి గమ్యానికి చేరితే చేరినట్లుగా పరిస్థితి ఉంది. సమయ పాలన తర్వాత సంగతి.. ఏ రైలు ఎన్ని గంటలకు వస్తుందో, రద్దు అవుతుందో తెలియని దుస్థితి నెలకొంది. రైళ్లను ప్రయాణ సమయానికి రెండు, మూడు రోజుల ముందు కూడా రద్దు చేసేస్తుండడంతో టూర్ ప్లాన్ అంతా నాశనం అవుతోందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక రైళ్లు వేశామని చెప్తున్న రైల్వే శాఖ పలు రైళ్లను రద్దు చేస్తుండడంతో ప్రత్యేక రైళ్లు నడుపుతున్న ఫలితం ఉండడం లేదు. కాకినాడ నుంచి అసలు ప్రత్యేక రైళ్లే లేవు. సామర్లకోట, రాజమండ్రి వచ్చి ఎక్కాల్సిందే.

తాజాగా ఈ నెల 22న 02863 సంత్రాగచి-యశ్వంత్‌పూర్, 23న 22817 హౌరా-మైసూరు, 23న 22850 సికింద్రాబాద్-షాలిమార్, 24న 02864 యశ్వంత్‌పూర్-సంత్రాగచి, 25న 22818 మైసూరు-హౌరా రైళ్లను రద్దు చేసేసింది. దీంతో ఈ రద్దీ అంతా ప్రత్యేక, రోజువారీ, వారాంతపు రైళ్లపై పడనుంది.

● పుణ్యక్షేత్రాలకు వెళ్లాలన్నా....

వేసవి సెలవుల్లో విహారం కంటే ఉమ్మడి తూర్పు గోదావరి నుంచి ఎక్కువగా పుణ్య క్షేత్రాలకు వెళుతుంటారు. ఒడిశాలోని పూరి, కోణార్క్, తమిళనాడులో మదురై, తంజావూరు, కుంభకోణం, కన్యాకుమారి, కేరళలోని తిరువనంతపురం, మహారాష్ట్రలోని శిరిడికి ఎక్కువగా ప్రయాణాలు ఉంటాయి. కానీ రెండు నెలల ముందు రిజర్వేషన్లు చేయించుకుంటే పర్వాలేదు. కానీ ఇప్పటికి ఇప్పుడు కావాలంటే ఎంతమాత్రం దొరికే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లు నడిపితే కాస్త ఊరటగా ఉంటుందని ప్రయాణికులు చెప్తున్నారు. మూడు జిల్లాల ఎంపీలు కల్పించుకోవాలని వారు కోరుతున్నారు.

వెయింటింగ్ లిస్ట్ 210

కాకినాడ, కోనసీమ, మన్యం, తూర్పు గోదావరి.. నాలుగు జిల్లాలకు గేట్‌వే వంటి రాజమండ్రి రైల్వే స్టేషను ద్వారా హైదరాబాద్, బెంగళూరులకు ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. ప్రతిరోజూ హైదరాబాద్‌కి సుమారు 18 రైళ్లు నడుస్తుండగా.. వాటిలో 10 నిత్యం రాకపోకలు సాగిస్తాయి. కాకినాడ నుంచి గౌతమి రోజూ ఉండగా.. రోజూ ఒకట్రెండు వారాంతపు రైళ్లు ఉంటాయి. వేసవి రద్దీ క్లియర్ చేయడానికంటూ పలు స్పెషల్ రైళ్లను నడుపుతున్నారు. అయితే అవి సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగించేవి కావడంతో ఈ ప్రాంతం వాళ్లకు ఎలాంటి ఉపయోగమూ ఉండట్లేదు.

ఉదాహరణకు ప్రతి గురువారం నహర్‌లగూన్ (రాజస్థాన్)-చర్లపల్లి, కటక్ (భువనేశ్వర్)-సికింద్రాబాద్ రైళ్లు నడుస్తున్నాయి. వీటిలో ఎక్కడానికి కూడా వీలుండదు. రాజమండ్రి నుంచి హైదరాబాద్‌కి వందే భారత్‌కి స్లీపర్ క్లాస్ 1425, ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ 2535 ఉన్నా వెయిటింగ్ లిస్టే. గరీబ్‌రథ్‌కి జూన్ 8 వరకూ ఖాళీల్లేవు. ప్రతి గురువారం నడిచే విశాఖ-శిరిడికి జూన్ 5 వరకు, ఫలక్‌నుమా జూన్ 12, విశాఖ-మహబూబ్‌నగర్ జూన్ 10, గోదావరికి జూన్ 11, గౌతమికి జూన్ 10 వరకు స్లీపర్ రిజర్వేషన్లు లేవు. ఏసీ క్లాసుల పరిస్థితి కూడా అలాగే ఉంది. కోకనాడ, జన్మభూమికి కూడా అదే పరిస్థితి ఉంది.





హతియా-బెంగళూరు ట్రైన్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

జన సాధారణ్ రైళ్లు ఉన్నాయని రైల్వే శాఖ చెప్తున్నా... అవి గువాహటి, హౌరా వంటి సుదూర ప్రాంతాల నుంచి ఉండడంతో అక్కడే బోగీలు నిండిపోతాయి. ఈ ప్రాంతం వాళ్లకు వాటితో ఎలాంటి ఉపయోగమూ లేదు. చెన్నైకి టాటా, ధన్‌బాద్, పురూలియా, న్యూతిన్సూకియా, షాలిమార్ (కోరమాండల్), హౌరా, భువనేశ్వర్ నుంచి రైళ్లు ఉన్నాయి. హౌరా-కన్యాకుమారి, భువనేశ్వర్-పుదుచ్చేరి, ముజఫర్‌పూర్-జోలార్‌పేట్ వరకు వారానికి ఒకసారి, సిల్చార్-కోయంబత్తూరు, భువనేశ్వర్-చెన్నై, జసిద్-తాంబరం (గురు), ఖరగ్‌పూర్-విల్లుపురం, భువనేశ్వర్-రామేశ్వరం, విశాఖ-చెన్నై (శుక్ర), హౌరా-తిరుచురాపల్లి (సోమ,శుక్ర) గువాహటి నుంచి మూడు రోజులు జోలార్‌పేట్ వరకు, షాలిమార్-త్రివేండ్రం (మంగళ, బుధ) ఉన్నాయి. సంత్రాగచి-చెన్నై ఏసీ ఎక్స్‌ప్రెస్ బుధ, శనివారాల్లో నడుస్తోంది. వీటిలో బెర్తులు దొరకాలంటే అదృష్టాన్ని నమ్ముకోవాల్సిందే. కాకినాడ నుంచి చెన్నైకి వారానికి మూడు రోజులు తాంబరం ఎక్స్‌ప్రెస్, మరో మూడు రోజులు సర్కార్ ఉన్నాయి. కానీ వీటికీ రిజర్వేషను వెయిటింగ్ లిస్టులోకి వెళ్లిపోయింది.

నాటక రంగాభివృద్ధికి ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుంది

- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్
- ఘనంగా ప్రారంభమైన మూలారెడ్డి పరిషత్ నాటిక పోటీలు



రామవరంలో జాతీయస్థాయి నాటిక పోటీలను ప్రారంభించి మూలారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి కందుల దుర్గేష్



ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

అనపర్తి, మే 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాటిక రంగాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గంలో మంత్రిగా పనిచేయడం తన అదృష్టమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం రాత్రి అనపర్తి మండలం రామవరంలో నల్లమిల్లి మూలారెడ్డి కళాపరిషత్ 36వ జాతీయస్థాయి సాంఘిక నాటికల పోటీలను మంత్రి దుర్గేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిషత్ వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పరిషత్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన నాటిక పోటీల ప్రారంభసభలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నంది నాటకోత్సవాలను పునఃప్రారంభించి అనేకమంది కళాకారులను సత్కరించామన్నారు. నాటక రంగం అంతరించి పోలేదని కళ బ్రతికే ఉందని ప్రోత్సాహమే కరువైందన్నారు.

కళాకారులకు అందించే పింఛన్లను సైతం వైసీపీ ప్రభు త్వం నిలిపివేసి కళాకారులకు తీరని అన్యాయం చేసిందన్నారు. నాటక రంగానికి వైభవం తీసుకువచ్చే విధంగా పరిషత్‌లకు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ ఏడాది నవంబరులో నంది అవార్డుల ప్రధానోత్సవం జరుగుతుందని అన్నారు. తండ్రి ఆశయాన్ని నిలిపేందకు పరిషత్‌ను తన భుజస్కందాలపై వేసుకు ని పరిషత్‌ను నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అభినందనీయుడని అన్నారు. రాష్ట్ర గనులు, అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ కళలను బ్రతికించాలన్న మూలారెడ్డి సంకల్పాన్ని వారసత్వంగా తీసుకుని ఓ వైపు ప్రజాసేవ మరోవైపు కళాసేవ చేస్తున్న రామకృష్ణారెడ్డికి కళామతల్లి ఆశీస్సులు మెండుగా ఉంటాయని అన్నారు. ఈ పరిషత్ శత వార్సికోత్సవాలు దిగ్విజయంగా జరుపుకోవాలని కోరుకుంటున్నానని అన్నారు. సినీ నటుడు గౌతమ్‌రాజు మాట్లాడుతూ గోదావరి తల్లి ఎందరో కళాకారులను, కళా పోషకులను అందించిందని పరిషత్ ఏర్పాటు ద్వారా ఎంతో మంది కళాకారుల అభ్యున్నతికి పాటుపడిన నల్లమిల్లి కుటుంబ సేవలు కళాకారులు మరచి పోలేరన్నారు. అదే విదంగా అభినయ నాటిక పరిషత్ అధ్యక్షుడు అభినయ శ్రీనివాస్, రాష్ట్ర పరిషత్ నిర్వాహకుల సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకటరామారావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ప్రసంగించి పరిషత్‌ను కొనియాడారు. పరిషత్ అధ్యక్షుడు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తన తండ్రి మూలారెడ్డికి నాటక రంగంపై ఉన్న ప్రేమతో పరిషత్‌ను ప్రారంభించారని ఆయన ఆశయ సాధన కోసం పరిషత్‌ను ముందుకు తీసుకువెళతానని అన్నారు. ఈ సందర్భంగా మీడియా రంగం ద్వారా సేవలందిస్తున్న మహా న్యూస్ ఎండీ మారెళ్ళ వంశీకృష్ణను ఘనంగా సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త మేడపాటి రామలింగారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు, నల్లమిల్లి అభిమానులు పాల్గొన్నారు.



తిరంగా యాత్రలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు

పిఠాపురంలో తిరంగా ర్యాలీ

- మాజీ సైనికులకు సత్కారం

పిఠాపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌తో మన సైనిక శక్తిని ప్రపంచానికి చాటిచెప్పిన సైనికులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ కాకినాడ జిల్లా పిఠాపురంలో బుధవారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించారు. పాదగయ సెంటరువద్ద ప్రారంభ మైనయాత్ర కోటగుమ్మం, మెయిన్‌రోడ్డు, ఉప్పాడ సెంటరు వరకు సాగింది. అక్కడ దేశానికి సేవలు అందించిన మాజీ సైనికులను నాయకులు సత్కరించారు. ఆపరేషన్ సిందూర్ విజయం మన సైనికుల వీరత్వానికి, మనదేశ సార్వభౌమాధికారానికి నిదర్శనమని నాయకులు కొనియాడారు. ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు గండి కొండలరావు, దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, వీహెచ్‌పీ నా యకులు డి.వెంకటేశ్వరరావు, సురేంద్ర దత్తు, బీజేపీ, జనసేన నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆభరణాలు తనిఖీ

- బంగారం సుమారు రూ.6కోట్లు, వెండి రూ.2కోట్లు నిర్ధారణ



వెంకన్న ఆలయంలో స్వామివారి ఆభరణాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, మే21(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం దేవాదాయ, ధర్మాదాయశాఖ తనిఖీ అధికారి జేవీవో వి.పల్లంరాజు స్వామివారి ఆభరణాలను తనిఖీ చేశారు. వెండి, బంగారు ఆభరణాలను తన సిబ్బందితో లెక్కించారు. ఇప్పటివరకూ స్వామివారికి 163 బంగారు ఆభరణాలు, 303 వెండి ఆభరణాలు ఉన్నట్లు నిర్ధారించారు. బంగారం 7కేజీల 421 గ్రాముల 162మి.లి.గ్రా వీటి విలువ సుమారు రూ.6 కోట్లు, వెండివస్తువులు 183కేజీ339గ్రా 808 మి.లి.గ్రాలు సుమారు రూ.2కోట్లుగా అంచనా వేశారు. ఉదయం నుంచి రాత్రి వరకూ స్వామివారి ఆభరణములు తనిఖీ అధికారులు లెక్కించారు. స్వామివారి వెండి, బంగారు వస్తువులకు ఇన్సూరెన్స్ చేసినట్లు ఆలయ ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వస్తువులు లాకర్లలో భద్రపరచనున్నట్లు తెలిపారు.

ఏపీఈఏపీ సెట్ ఇంజనీరింగ్ పరీక్షలు ప్రారంభం

- ఉమ్మడి జిల్లాలోని 9 కేంద్రాల్లో 96.25 శాతం హాజరు నమోదు

జేఎన్టీయూకే, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో ఏపీఈ ఏపీసెట్-2025 ఇంజనీరింగ్ ఆన్‌లైన్ ప్రవేశపరీక్షలు బుధవారం కాకినాడ, తూర్పుగోదావరి, డా క్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రశాంతంగా జరిగాయని కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. మూడు జిల్లాల్లో ని 9 కేంద్రాల్లో రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించామన్నారు. సీబీ ఎస్ఈ, ఐసీఎస్ ఈ, ఏపీవోఎస్ఎస్ ద్వారా ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు ఏపీఈఏపీసెట్ వెబ్‌సైట్‌లో డిక్లరేషన్ ఫారంలో తమ మార్కులను ఎంట ర్‌చేస్తే ర్యాంకులు కేటాయిస్తామని తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షల ప్రాథమిక 'కీ'ని ముందుగా షెడ్యూల్‌లో ప్రకటించినట్టు కాకుండా ఈనెల 27వ తేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తామన్నారు. కాకినాడ జిల్లాలోని 5కేంద్రాల్లో ఉదయం సెషన్‌లో 888 మంది విదార్థులకు 851మంది హాజరు కాగా 37 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ఇంజనీరింగ్ పరీక్షకు 895మంది విదార్థులకు 868 మంది హాజరు కాగా 27మంది రాయలేదు. రెండు సెషన్లకు కలిపి 96.41శాతం హాజరు నమోదైంది. తూర్పుగోదావరి జిల్లాలోని రెండు కేంద్రాల్లో రెండుసె షన్లకు కలిపి మొత్తం 1000మంది విద్యార్థులకు 967 మంది హాజరుకాగా 33మంది గైర్హాజరయ్యారు. 96.70 శాతం హాజరు నమోదైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లాలోని రెండు కేంద్రాల్లో రెండు సెషన్లలో 806మంది విద్యార్థులకు 771మంది హాజరుకాగా 35మంది పరీక్ష రాయలేదు. మొత్తం 95.66శాతం విద్యార్థులు హాజరయ్యారు. ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు ఈనెల 27వ తేదీ వరకు కొనసాగుతాయని కన్వీనర్ చెప్పారు.

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో

కస్టమ్స్ కమిషనర్ పూజలు

ద్రాక్షారామ, మే 21(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని బుధవారం కస్టమ్స్ కమిషనర్ రమేష్‌కుమార్ రామన్ బుధవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. రమేష్‌కుమార్ రామన్ దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగత ం పలికారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దర్శన అనంతరం నంది మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందుకున్నారు.



భీమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న కస్టమ్స్ కమిషనర్ దంపతులు

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ప్రారంభం

కాకినాడరూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్లలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల ప్రక్రియ బుధవారం ప్రారంభమైందని కాకినాడజిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు. ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన హెచ్‌ఎంలు, ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు తప్పనిసరిగా బదిలీలకు అర్హులన్నారు. అభ్యర్థన బదిలీకోసం ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అనంతరం ఉద్యోగోన్నతుల ప్రక్రియ నిర్వహిస్తామని డీఈవో చెప్పారు.

బ్యారేజ్..డామేజ్!

- అస్తవ్యస్తంగా కాటన్ బ్యారేజీ నిర్వహణ
- వెలగని విద్యుత్ దీపాలు
- పెరిగిపోయిన పిచ్చిమొక్కలతో బీటలు
- రహదారిపై గోతులతో ప్రజలకు పాట్లు


పిచ్చిమొక్కలు పెరగడంతో బీటలు వారుతున్న దృశ్యం
బొబ్బర్లంక మెగా వాటర్ ప్రాజెక్టు రహదారిపై గోతులు
బ్యారేజీపై విద్యుత్ దీపాలు వెలగక అంధకారం
బ్యారేజీపై లైట్లు ఊడిపోయి దర్శనమిస్తున్న స్తంభం

ఆత్రేయపురం, మే 21(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న కాటన్ బ్యారేజీ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సర్ఆర్థర్ కాటన్ బ్యారేజీ నిర్మించి ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేశారు. కానీ దీని నిర్వహణ పట్టించుకోకపోవడంతో మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. పిచ్చి మొక్కలు పెరిగిపోయి బీటలు వారుతుంది. వీటిని తొలగించే నాధుడు కరువయ్యాడు. బ్యారేజీ పొడవునా విద్యుత్ దీపాలు వెలగక రాత్రి వేళల్లో ప్రయాణికులు పడరానిపాట్లు పడుతున్నారు. చిమ్మచీకటిలో వెళ్తూ అవస్థలు పడుతున్నారు. ఈ బ్యారేజీ తూర్పుగోదావరి జిల్లా, కోనసీమ జిల్లా పరిధిలోకి విస్తరించి ఉంది. గత ప్రభుత్వ హయాంలో బ్యారేజీ రహదారి అధ్వానంగా మారింది. ప్రయాణం నరకప్రాయంగా ఉండడంతో కూటమి ప్రభుత్వం రహదారిని నిర్మించింది. అయితే ఏడాది గడవకుండానే బొబ్బర్లంక మెగా ప్రాజెక్టు వద్ద రహదారిపై గోతులు ఏర్పడ్డాయి. వాటిల్లో వర్షాలకు నీళ్లు ఉండిపోయి మరింత పెద్దగా మారుతున్నాయి. ఇరిగేషన్ సిబ్బంది నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో బ్యారేజీ అధ్వాన స్థితికి చేరుకుంది. బ్యారేజీ అందాలను తిలకించేందుకు నిత్యం పర్యాటకులు సందర్శిస్తుంటారు. చరిత్ర గల బ్యారేజీ మనుగడను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ.1.55 కోట్లు


భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం, మే 21 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడికి భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించగా రూ.1,55,04,639 నగదు, 48 గ్రాముల బంగారం, 730 గ్రాముల వెండి సమకూరాయి. వీటితోపాటుగా యూఎస్ఏకు చెందిన 184 డాలర్లు, యుఏఈ 25 దిరహమ్స్, కెనడా 15తో పాటుగా పలుదేశాల కరెన్సీని భక్తులు హుండీలలో వేశారు. హుండీ లెక్కింపును ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది, సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు. 26 రోజులకు ఈ ఆదాయం లభించగా సరాసరి రోజుకు రూ.5.96 లక్షలు భక్తులు హుండీలలో కానుకల రూపంలో సమర్పించారు.

కాపవరంలో డీఎల్‌పీవో నాగలత విచారణ

బిక్కవోలు, మే 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కాపవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి సర్పంచ్ వేధిస్తున్నాడంటూ ఆత్మహత్యకు పాల్పడిన విషయం విధితమే. ఈ విషయమై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం డివిజినల్ పంచాయితీ అధికారి నాగలత బుధవారం విచారణ చేపట్టారు. కాపవరం పంచాయితీలో సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్తులను విచారించారు. ఆమె వెంట డిప్యూటీ ఎంపీడీవో జాన్‌మిల్టన్ ఉన్నారు.


కాపవరం పంచాయితీలో వార్డు సభ్యులను విచారిస్తున్న డీఎల్‌పీవో నాగలత

పుష్కరాలకు వెళ్లొస్తూ తిరిగిరాని లోకాలకు..


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

లారీ ఢీకొని తల్లికొడుకు మృతి

మరో నలుగురికి తీవ్రగాయాలు

కొత్తగూడెంలో ఘటన, మృతులది కోనసీమ జిల్లా


మృతిచెందిన కనకదుర్గ, వెంకటరత్నం (ఫైల్‌ఫొటోలు)

అంబాజీపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులతో ఎంతో ఆనందంగా కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు వెళ్లి భద్రాచలంలో దైవ దర్శనం చేసుకుని తిరిగి వస్తున్న ఓ కుటుంబాన్ని మృత్యువు కబళించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం చిరతపూడి గ్రామానికి చెందిన మామిడిశెట్టి వెంకటపతి(ముసలయ్య), భార్య కనకదుర్గ(54), కుమారుడు వెంకటరత్నం(32), కోడలు జ్యోతిస్వరూప, మనమలు దీక్షిత, చేతన్లు ఈనెల 19వ తేదీన రాత్రి తెలంగాణ రాష్ట్రం కాళేశ్వరం పుష్కరాలకు కారులో వెళ్లారు. పుష్కరాల్లో స్నానం చేసి 20వ తేదీన భద్రాచలం రాములవారి దర్శనానికి వెళ్లారు. అనంతరం 20వ తేదీన రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా కొత్తగూడెం వద్దకు వచ్చేసరికి బొగ్గు లోడులారీతో వస్తున్న లారీ కారును బలంగా ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న కనకదుర్గ, వెంకటరత్నం అక్కడికక్కడే మృతిచెందారు. వెంకటపతి, జ్యోతిస్వరూప, దీక్షిత, చేతన్లకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను విజయవాడలో ఓ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. దీంతో చిరతపూడి గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. వెంకటరత్నం ఐదు రాష్ట్రాల్లో మెటల్ఏన్డీపీ అండ్ ఇన్‌స్పెక్షన్ సర్వీసు పార్టనర్‌గా ఉన్నారు. అందరితో కలిసిమెలిసి ఉంటూ ఆప్యాయంగా పలకరించే వెంకటరత్నం మృతిని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. కనకదుర్గ, వెంకటరత్నం మృతదేహాలను చిరతపూడి తీసుకువచ్చారు. వారి మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేసి కుటుంబసభ్యులను ఓదార్చారు.

కోనసీమలో 3వేల సీసీ కెమెరాలు

- మహిళలపై జరిగే నేరాలను గుర్తించడానికి 6 జిల్లాల్లో ప్రత్యేక టీములు
- ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్


పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఐజీ


మలికిపురంలో విలేకర్లతో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

మలికిపురం, మే 21(ఆంధ్రజ్యోతి): నేరాల అదుపునకు పోలీసులు నూతన టెక్నాలజీని ఉపయోగించి చాలా ఫలితాలు సాధించినట్టు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ముఖ్య కూడళ్లలో ఇప్పటికే 3వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. బుధవారం మలికిపురం పోలీసుస్టేషన్ సందర్శనకు వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. నేరాల దర్యాప్తు, పరిశోధనలలో కెమెరాలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయన్నారు. ఈ మధ్య కాలంలో జరిగిన నేరాలు, దొంగతనాలను, నేరస్తులను గుర్తించడానికి సీసీ కెమెరాలు చాలా దోహదపడ్డాయన్నారు. పలు గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు, వర్తక సంఘాలు, దాతలు ముందుకు వస్తున్నారని ప్రసంశించారు. గ్రామాల్లో నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేసుకునేవారు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. మలికిపురం పోలీసుస్టేషన్ పరిధిలో క్రైమ్ రేటు తక్కువగా ఉందన్నారు. సీసీ కెమెరాల ద్వారా అమలాపురం వంటి ప్రాంతాల్లో దేవాలయాల్లో దోపిడీలు చేసినా శ్రీకాకుళం గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. జిల్లాలో గంజాయి నేరాలు తగ్గాయని, ఈ కేసుల్లో పాత నేరస్తులపై నిఘా ఉంచి కట్టడి చేస్తున్నామని వీటి కోసం ఈగల్ బృందాలు పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు. గల్ఫ్ వెళ్లేవారు ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటున్నారని, మోసాలకు గురవుతున్నారని, లైసెన్సు కలిగిన ఏజెంట్ల ద్వారా విదేశాలకు వెళ్లేలా అవగాహన కల్పిద్దామన్నారు. మహిళలపై జరిగే నేరాలపై వెంటనే స్పందించి ప్రత్యేక బృందాల ద్వారా గుర్తించి వారికి వెంటనే శిక్షలు పడేలా ఏలూరు రేంజ్ పరిధిలోని 6జిల్లాల్లో ప్రత్యేక టీములు పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు.

మహిళల కోసమే శక్తి యాప్


ప్రమాదాలు జరిగే ప్రాంతాలు గుర్తించామని, రోడ్ సేఫ్టీ సమావేశాల్లో ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి భద్రతా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఎక్కువ ప్రమాదాలు రోడ్లపై నిలిపి ఉంచిన వాహనాల ద్వారా జరుగుతున్నాయని, రోడ్డుపై వాహనాలు నిలిపి ఉంచకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం శక్తి యాప్ ప్రవేశపెట్టిందని, నేరాలకు పాల్పడే వారిని గుర్తించి వారిపై చర్యలు వెంటనే తీసుకోనున్నట్టు తెలిపారు. మలికిపురం స్టేషన్‌లో రికార్డులను ఐజీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగా ఆయనకు జిల్లా ఎస్పీ కృష్ణారావు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఐజీ పోలీసు వందనాన్ని స్వీకరించారు. మలికిపురం ఎస్ఐ పి.సురేష్‌కి మొక్క అందజేసి స్వాగతం పలికారు. సమావేశంలో ఎస్పీ బి.కృష్ణారావు, డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ నగేష్ కుమార్, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ అదుపుతప్పి వ్యక్తి మృతి


షేక్ నాగూర్ (ఫైల్)

గండేపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డు మీద పడి వ్యక్తి మృతిచెందాడు. గండేపల్లి ఎస్ఐ శివ నాగబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా గండేపల్లికి చెందిన షేక్ నాగూర్ (57) గండేపల్లి నుంచి అతడు డ్రైవర్‌గా పనిచేస్తున్న గైట్ కాలేజీకి బుధవారం మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా మురారి గ్రామ శివారున దాబా ఎదురుగా వచ్చేసరికి మోటార్ అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. బంధువులు గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ కేసు నమోదు చేశారు.

పురుగుల మందు తాగి...


సింహాద్రి(ఫైల్)

అంబాజీపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి వ్యక్తి మృతిచెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటకు చెందిన రంకిరెడ్డి సింహాద్రి (40) సమస్యలతో మనస్తాపానికి గురై ఈనెల 20న మొసలపల్లి శివారు కొబ్బరి తోటల్లో పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో అతడిని అమలాపురం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతడికి భార్య జ్యోతి, కుమార్తె కీర్తి, కుమారుడు శ్రీరామ్ ఉన్నారు. ఈ విషయంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు.

ఆసుపత్రికి వెళ్లొస్తుండగా..

కారు ఢీకొని మహిళ మృతి


ప్రమాదంలో మరణించిన మాణిక్యం


ఫైల్‌ఫొటో

రాజానగరం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుని తిరిగి వస్తూ రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కలవచర్ల గ్రామానికి చెందిన యర్రా మాణిక్యం (54) వైద్య పరీక్షలు నిమిత్తం మనుమరాలు అంజలి సహాయంతో బుధవారం రాజానగరం సమీపంలో జీఎస్ఎల్ ఆసుపత్రికి వెళ్లారు. వైద్య పరీక్షలు చేయించుకుని తిరిగి వస్తూ ఆసుపత్రి వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కారు మాణిక్యాన్ని బలంగా ఢీకొని మీద నుంచి వెళ్లింది. ఇదే సమయంలో వెనుక వైపు వస్తున్న మరో కారు, ప్రమాదానికి కారణమైన కారును ఢీకొంది. దీంతో బలమైన గాయాలు కావడంతో మాణిక్యం అక్కడికక్కడే మృతిచెందింది. మనుమరాలు అంజలి ఈ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడింది. మాణిక్యానికి కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, కలవచర్ల జనసైనికులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం త్వరితగతిన చేపట్టేలా సహాయ సహకారాలు అందించారు. రాజానగరం ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.500 నకిలీ నోట్లతో ఇద్దరి అరెస్ట్

అంగర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు


అంగర పోలీస్ స్టేషన్‌లో నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ, ఎస్ఐ

కపిలేశ్వరపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): రూ.500 నకిలీ నోట్లను చెలామణి చేస్తున్న ఇద్దరు నిందితులను మండపేట రూరల్ సీఐ దొరరాజు పట్టుకున్నారు. ఈ మేరకు బుధవారం కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలను సీఐ దొరరాజు, అంగర ఎస్ఐ రవికుమార్ విలేకర్లకు వెల్లడించారు. మంగళవారం అంగర రైస్ మిల్లు ఎదురుగా ఉన్న కిల్లీ షాపులో రాజమహేంద్రవరానికి చెందిన మన్యం వీరవెంకట సత్యసీతారామారావు రూ.500 నోటు ఇచ్చి సిగరెట్ బాక్స్ కొన్నాడు. ఆ నోటును చూసి అనుమానం వచ్చిన షాపు యజమాని కసెట్టి సత్యనారాయణ స్థానికుల సాయంతో నిందితుడిని అంగర పోలీసులకు అప్పగించారు. అతడు ఇచ్చిన సమాచారంతో విజయవాడలోని మరో నిందితుడు వారా నవీన్‌ను పట్టుకుని అతడి నుంచి 44 నకిలీ రూ.500 నోట్లను, ల్యాప్‌ట్యాప్, కలర్‌ప్రింటర్, 17ఎగ్జిక్యూటివ్ బాండ్ పేపర్లు, పెన్‌డ్రైవ్, మోటార్ సైకిల్‌ను స్వాధీన పర్చుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించనున్నట్టు సీఐ దొరరాజు తెలిపారు.

హైస్కూల్‌లో చోరీ చేసిన ఇద్దరి అరెస్ట్

శంఖవరం, మే 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం హైస్కూల్‌లో చోరీకి పాల్పడ్డ నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్ఐ శ్రీహరిబాబు వారి వివరాలను వెల్లడించారు. శంఖవరం గ్రామానికి చెందిన గామాల అశోక్, బోడపాటి చిన్నోడు స్థానిక హైస్కూల్‌లో కంప్యూటర్లు, ప్రింటర్‌తో పాటు మంచినీటిని శుద్ధిచేసే యంత్రం పార్టులను చోరీ చేశారు. బుధవారం ఉదయం నెల్లిపూడి శివారు బెండపూడి అడ్డురోడ్డులో నిందితులను ఆటోతో పాటు అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్నట్టు పోలీసులు తెలిపారు.


కాకినాడ జిల్లా శంఖవరంలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కాకినాడ జీజీహెచ్‌లో ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

జీజీహెచ్ (కాకినాడ), మే 21 (ఆంధ్రజ్యోతి): తప్పుడు మెడికల్ సర్టిఫికెట్ సృష్టించి ఇచ్చిన వ్యవహారంలో నిజం నిగ్గు తేలడంతో కాకినాడ జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌లపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.... కాకినాడ ఆర్టీసీ పరిధిలో కండక్టర్‌గా పనిచేస్తున్న బుద్దాల వెంకన్న వివాదాస్పదుడు. డిపోలోని ఉన్నతాధికారులతో గొడవపడడంతో అతడిపై కోర్టులో కేసు నడుస్తోంది. ఈ నేపథ్యంలో వెంకన్న పలు పర్యాయాలు కోర్టు వాయిదాకు హాజరుకాలేదు. దాంతో అతడిపై 2024లో వారెంట్ జారీ అయ్యింది. అయితే వెంకన్న కోర్టు వాయిదాలకు హాజరు కాని సమయంలో మెడికల్ సర్టిఫికెట్ కోర్టుకు, డిపోకు సమర్పిద్దామని పథకం పన్నాడు. ఈ క్రమంలో వెంకన్న జీజీహెచ్‌కు వచ్చి ఆర్థో విభాగంలోని కట్లు కట్టే చోట అనధికారికంగా సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న సత్యగురు అనే వ్యక్తిని కలిశాడు. తనకు మెడికల్ సర్టిఫికెట్ కావాలని, డబ్బులు ఇస్తానని చెప్పాడు. దాంతో సత్యగురు నడుం నొప్పి అని చెప్పి ఓపి టికెట్ తీసుకుని రమ్మన్నాడు. అనంతరం ఆర్ఎంవో దగ్గరకు వెళ్లి పాత తేదీల్లో మెడికల్ సర్టిఫికెట్ కావాలని అభ్యర్థించగా ఆమె తిరస్కరించారు. దాంతో సత్యగురు మరో పథకం పన్ని రెగ్యులర్ జూనియర్ అసిస్టెంట్‌లుగా పని చేస్తున్న బి.సత్యనారాయణ, ఎం.ఉమామహేశ్వరరావు నీ పని చేయిస్తారని డబ్బులు తెమ్మన్నాడు. డబ్బులు ఇచ్చిన వెంటనే వారిద్దరూ అదే రోజు మెడికల్ సర్టిఫికెట్‌ను వెంకన్నకు అందజేశారు. ఆ సర్టిఫికెట్‌ను వెంకన్న ఒక కాపీ డిపో మేనేజర్‌కు, మరో కాపీ కోర్టుకు సమర్పించాడు. అయితే ఉద్యోగ రీత్యా వెంకన్న వివాదాస్పదుడైన నేపథ్యంలో అనుమానం వచ్చి ఆ సర్టిఫికెట్‌ను జన్యూనిటీ కోసం డిపో మేనేజర్ జీజీహెచ్‌కు పంపారు. ఆ సర్టిఫికెట్‌ను పరిశీలించిన జీజీహెచ్ అధికారులు ఆ సంతకాలు, ఆ స్టాంపులు జీజీహెచ్‌కు సంబంధించినవి కావని నిర్ధారించి డిపో మేనేజర్‌కు అధికారికంగా తెలియపరిచారు. ఆ నివేదిక ఆధారంగా వెంకన్నను ఉద్యోగం నుంచి పూర్తిగా తొలగించారు. ఈ వ్యవహారం అంతా ఏడాది పొడవునా సాగింది. అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరిలో వెంకన్న జీజీహెచ్ అధికారులు తనపై తప్పుడు నివేదిక ఇచ్చారని కకలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును పరిశీలించాల్సిందిగా కలెక్టర్ జీజీహెచ్ అధికారులకు సిఫార్సు చేశారు. దాంతో ఆసుపత్రి అధికారులు ఒక కమిటి వేసి విచారణ చేసి 100 శాతం ఆ సర్టిఫికెట్ నకిలీదిగా నిర్ధారించారు. ఆ నివేదికను కలెక్టర్‌కు పంపడమే కాకుండా ఈ వ్యవహారానికి మూలం ఎవరు అనే దానిపై విచారించి. జూనియర్ అసిస్టెంట్‌లైన సత్యనారాయణ, ఉమామహేశ్వరరావులపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే అనధికారికంగా జీజీహెచ్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న సత్యగురుపై పోలీస్‌చర్యలకు అధికారులు ఉపక్రమిస్తున్నారు.

ఉద్యోగాలిప్పిస్తామని మోసం

రాజోలులో ముగ్గురిపై కేసు నమోదు

నిందితుల్లో ఇద్దరు అమలాపురం మాజీ ఎంపీ అనురాధ పీఏలు

రాజోలు, మే 21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేశామని రాజోలు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం పొన్నమండకు చెందిన మోకా రాజబాబు కుమారుడు దిలీప్‌కుమార్, మరో నలుగురు నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రాజోలు మండలం ములికిపల్లికి చెందిన ఎం.రాంబాబు ద్వారా అప్పటి అమలాపురం ఎంపీ చింతా అనురాధ వద్ద పీఏలుగా పనిచేసిన కె.చరణ్, కె.శ్రీకాంత్ వద్దకు 2021వ సంవత్సరంలో తీసుకువెళ్లారు. స్మార్ట్ విలేజ్, ఓఎన్జీసీ, అగ్రికల్చరల్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగాలు ఇప్పించి ఉపాధి కల్పిస్తామని నమ్మించారు. ఒక్కొక్కరి దగ్గర నుంచి రూ.లక్షా 50వేల చొప్పున డబ్బులు వసూలు చేశారు. నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి మోసం చేశారు. కొంత కాలానికి అవి నకిలీవని తేలడంతో తమ డబ్బులు తిరిగి ఇచ్చేయాలని బాధితులు కోరారు. డబ్బులు తిరిగి ఇవ్వక వేరొక ఉద్యోగం వేయిస్తామని చెబుతూ కాలయాపన చేశారు. దీంతో రాజోలు పోలీసుస్టేషన్‌లో అడబాల క్రాంతి, లింగమూర్తి, జిల్లెల్ల వంశీ, ఎస్.విజయ్‌కుమార్, ఎస్.విజయ్‌కుమార్, పి.దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.చరణ్, కె.శ్రీకాంత్, ఎం.రాంబాబులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

అన్నవరంలో యోగాసనాలు

అన్నవరం, మే 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో నెలరోజులపాటు భక్తులు, ఉద్యోగులతో యోగాసనాలు వేయించి వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని బుధవారం నుంచి అన్నవరం దేవస్థానం చేపట్టింది. నెలరోజులు పాత నిత్యకల్యాణమండపంలో ఈ యోగాసనా ల కార్యక్రమం చేపట్టనున్నట్టు ఈవో సుబ్బా రావు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ రోహిత్, దేవస్థానం ఉద్యోగులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.


సత్యదేవుడి సన్నిధిలో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

8 ఇసుక లారీల సీజ్

కె.గంగవరం, మే 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం - కోటిపల్లి రహదారిలో బుధవారం ఏవిధమైన అనుమతులు లేకుండా తరలిస్తున్న 8 ఇసుక లారీలను అదుపులోకి తీసుకున్నారు. పామర్రు ఎస్.ఐ. ఎస్.కె.జానీబాషా చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. మైనింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు బృందం తనిఖీల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్టు తెలిసిందిని, దీంతో మైనింగ్ అధికారిణి సుజాత ఎనిమిది ఇసుక లోడ్ లారీలను సీజ్ చేసి తమకు కస్టడీకి అప్పగించారని పేర్కొన్నారు. ఇవి కపిలేశ్వరపురం మండలంలోని ఇసుక ర్యాంపుల నుంచి వస్తున్నట్టు తెలిసింది.

అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు

మలికిపురం, మే 21(ఆంధ్రజ్యోతి): మలికిపురం ఎత్తు వంతెన వద్దనున్న శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

ఐ.పోలవరం, మే21(ఆంధ్రజ్యోతి):అనారోగ్యంతో బాధపడుతున్న గుత్తెనదీవికిచెందిన లంక దుర్గకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2లక్షల చెక్కును బుధవారం మురమళ్ల క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అందజేశారు. సర్పంచ్ లంకలపల్లి దుర్గాదేవీమునిరాజు, టీడీపీ నాయకుడు చిక్కాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పి.గన్నవరం పశువైద్యశాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ
- కొత్త ఆసుపత్రి నిర్మాణానికి ప్రతిపాదనలు
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన


పి.గన్నవరం పశువైద్యశాలలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, మే 21(ఆంధ్రజ్యోతి): ఏరియా ఆసుపత్రికి మీరు ఇద్దరేనా.... ఉద్యోగులు మిగతావారు ఎక్కడా.. మీ ఏడీఏ లేరా.. శిథిలావస్థలో ఉన్న ఆసుపత్రిని కనీసం మీరైనా శుభ్రపర్చండి.. ఇక్కడ పశువులకు ఏవిధంగా సేవలు అందిస్తున్నారు.. ఇలా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పి.గన్నవరం ఏరియా పశువైద్యశాలను సందర్శించి అక్కడున్న ఇద్దరు ఉద్యోగులను ప్రశ్నించారు. 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 20న ప్రచురితమైన శిథిలావస్థలో పి.గన్నవరం ఏరియా పశువైద్యశాల కథనానికి ఎమ్మెల్యే గిడ్డి స్పందించి ఆసుపత్రిని సందర్శించారు. ఏడీఏ డిప్యుటేషన్‌పై వెళ్లిపోయారని, ప్రస్తుతం అమలాపురం ఏడీఏ విజయారెడ్డి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారని సిబ్బంది చెప్పారు. దీంతో విజయారెడ్డితో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా ఇప్పటివరకు ఆసుపత్రి ఇంత అధ్వానంగా ఉందని నాదృష్టికి ఎందుకు తీసుకురాలేదని అసహనం వ్యక్తం చేశారు. ఆసుపత్రికి సంబంధించిన వివరాలతో క్యాంపు కార్యాలయానికి రావాలని ఏడీఏకు సూచించారు. ఆసుపత్రిని పూర్తిగా తొలగించి కొత్త భవనాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారుచేసి సంబంధిత శాఖకు పంపిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఆసుపత్రిని పూర్తిస్థాయిలో అభివృద్ధిచేసి సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈప్రాంతంతో డ్రైనేజీ సౌకర్యం లేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధాన రహదారి చెంతనే రూ.70లక్షలతో డ్రైనేజీ నిర్మాణం జరగనుందని, చిన్న డ్రైనేజీలన్ని ప్రధాన డ్రైన్‌కు అనుసంధానం చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు తాటికాయల శ్రీనివాసరావు, షేక్ దొరబాబు, టి.నాగరాజు ఉన్నారు.

అధికంగా సిజేరియన్ ప్రసవాలు చేస్తే చర్యలు

- డీఎంహెచ్‌వో దుర్గారావుదొర


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో దుర్గారావుదొర

ముమ్మిడివరం, మే 21(ఆంధ్రజ్యోతి): నార్మల్ ప్రసవాలు అయ్యేలా ప్రైవేటు ఆసుపత్రుల గైనకాలజిస్టులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావుదొర సూచించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో బుధవారం జిల్లాలో అధికంగా సిజేరియన్ ప్రసవాలు చేస్తున్న ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్య గైనకాలజిస్టులతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సిజేరియన్ ప్రసవాల వల్ల తల్లి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. దానివల్ల మాతృత్వ మరణాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని, నార్మల్ ప్రసవాలు జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సిజేరియన్ ప్రసవాలు చేసే ఆసుపత్రులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. సమీక్షా సమావేశంలో ప్రభుత్వ గైనకాలజిస్టు డాక్టర్ సత్యవేణి సిజేరియన్ ప్రసవాలపై జరిగే అనర్థాలను వివరించి, నార్మల్ ప్రసవాలు జరిగేలా ఏవిధమైన చర్యలు తీసుకోవాలో సూచనలిచ్చారు. ప్రైవేటు యాజమాన్య ఆసుపత్రుల్లో సిజేరియన్ ప్రసవాలు ఎక్కువ జరుగుతున్నట్టు దృష్టికి వచ్చిందన్నారు. ప్రైవేటు యాజమాన్య ఆసుపత్రులు, గైనకాలజిస్టులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ సీహెచ్‌వీ భారతిలక్ష్మి, డాక్టర్ టీకే శ్రీనివాసరావు, డాక్టర్ బీవీవీ సత్యనారాయణ, కె.వీరబాబు, ఎన్.రవి పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ విద్యామిత్ర కిట్లు పంపిణీ చేయాలి

- సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ మమ్మీ


ముమ్మిడివరంలో పాఠశాలలో ఏర్పాటుచేసిన స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న మమ్మీ

ముమ్మిడివరం, మే 21 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర స్టాక్ పాయింట్‌ను సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జి.మమ్మీ బుధవారం పరిశీలించారు. 2025-26 విద్యా సంవత్సరానికి రావాల్సిన స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు సరఫరా అయిన ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను స్టోర్ రూమ్‌లో జాగ్రత్తగా భద్రపరచాలని, బెల్టులను స్కూళ్ల వారీగా 2025 మార్చి 5వ తేదీ నాటి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అందించాలన్నారు. స్కూళ్లు ప్రారంభించే నాటికి ప్రతి విద్యార్థికీ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లు పంపిణీ చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థి నమోదు ప్రక్రియను పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లాలో 6 నుంచి 18సంవత్సరాల ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల వివరాలు సేకరించి వారు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో నమోదయ్యేలా చూడాలని సూచించారు. పీఎంఎస్‌హెచ్‌ఆర్ఐ పథకంలో భాగంగా ఏఏ కాంపోనెంట్స్ ఎన్ని గదులు వచ్చాయి. ఏవిధంగా ఖర్చు చేశారు. ప్రస్తుతం ఏయే పనులు జరుగుతున్నాయో తెలుసుకున్నారు. పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బీవీవీ సుబ్రహ్మణ్యం, జీసీడీవో ఎంఏకే భీమారావు, ఎంఈవో రాయుడు ఉదయభాస్కరరావు, డేటాఎంట్రీ ఆపరేటర్, భవిత సెంటర్‌ఉపాధ్యాయుడు, పీటీఐలు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్, వీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై నాటక ప్రదర్శన

అంబాజీపేట, మే 21(ఆంధ్రజ్యోతి): అమలాపురం జనకల్యాణ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాలతో స్థానిక సంతమార్కెట్‌లో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిని అరికట్టేందుకు నాటక ప్రదర్శన నిర్వహించారు. అమలాపురం ప్రభుత్వాసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ రామరాజు పర్యవేక్షణలో కళాకారులు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంబాజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి కేఎస్‌శ్రీనివాస్, జనకల్యాణ వెల్ఫేర్ సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ జి.శ్రీను, వర్కర్స్ ఎంవీ జ్యోతి, ఎం.శ్యామల, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

మామిడికుదురు, మే 21(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి కాకినాడ జిల్లా తూరంగి గ్రామానికి చెందిన నూజిల్ల శ్రీనివాస్ రూ.10వేలు విరాళంగా అందించారు. దాతకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేసి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

ఉద్యోగుల కౌన్సిల్ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు

ముమ్మిడివరం, మే 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జూన్ 5వ తేదీన నిర్వహించే మూడవ రాష్ట్ర కౌన్సిల్ మహాసభల పోస్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నాయకులు ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఆవిష్కరించారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కె.వీరబాబు, కార్యదర్శి కె.మల్లిబాబు, ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రమాదాలకు కేరాఫ్ గొల్లవిల్లి సెంటర్


ప్రమాదాలకు నిలయంగా మారిన గొల్లవిల్లి సెంటర్

ఉప్పలగుప్తం, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన వ్యాపార కూడలి గొల్లవిల్లిలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతీ రోజు సాయంత్రం 6 నుంచి 8గంటల మధ్య గొల్లవిల్లి సెంటర్ రద్దీగా ఉంటుంది. సోమవారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు పరస్పరం ఢీ కొట్టడంతో ఇద్దరు గాయపడ్డారు. ఇక్కడ ఆర్‌అండ్‌బీ రహదారిపై సాయంత్రం సమయంలో ఎక్కువ మంది యువత సెల్‌ఫోన్లు మాట్లాడుతూ లేదా మద్యం సేవించి వాహనాలు నడపడంతో ఈప్రమాదాలు జరుగుతున్నట్టు బహిర్గతమయ్యింది. ఎన్టీఆర్ విగ్రహం మలుపులో ఆటోలు, ద్విచక్రవాహనదారులు అత్యంత వేగంతో రావడంతో ప్రమాదాలు జరుగుతున్నట్టు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు రోడ్లపై పార్కు చేస్తున్నందున ఇక్కడ తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. సెంటర్‌కు సమీపంలోనే వైన్‌షాపు ఉండటంతో సాయంత్రం వేళ మద్యం షాపునకు వెళ్లేవారితో ఈరహదారి రద్దీగా ఉంటుంది. ఈసమయంలోనే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సెంటర్‌కు దగ్గరగా ఉన్న వైన్‌షాపు వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిపైనే వాహనాలు నిలపడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈవైన్‌షాపు వద్దే రోడ్డుపై నిలిపిన ట్రాక్టర్‌ను ఢీకొట్టి ఒక యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఈఅంశాలను దృష్టిలో ఉంచుకుని సాయంత్రం వేళ వైన్‌షాపు, గొల్లవిల్లి ప్రాంతాల్లో నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వేట నిషేధం పెంపునకు కృషి: మల్లాడి


మాట్లాడుతున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, మే 20(ఆంధ్రజ్యోతి): యానాంలో మత్స్యకారులకు పుదుచ్చేరి ప్రభుత్వం ఇచ్చే వేట నిషేధం రూ.8వేల నుంచి రూ.20వేలకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. యానాం మత్స్యశాఖ ఆధ్వర్యంలో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏ మునిస్వామి హాజరయ్యారు. ఈసందర్భంగా మల్లాడి మాట్లాడుతూ మత్స్యకారుల అభ్యున్నతి కోసం కృషి చేస్తానన్నారు. రానున్న పది నెలల్లో మంచి రోజులు రానున్నాయన్నారు. వేట నిషేధం ఏపీ ప్రభుత్వం మాదిరిగా రూ.20 వేలు ఇచ్చేలా కృషి చేస్తానన్నారు. ఓఎన్జీసీ రెండో పైప్‌లైన్ పనులు నవంబరు నుంచి ప్రారంభమవుతాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే గొల్లపల్లి, ఆర్ఏ మునిస్వామిలు మాట్లాడారు. అనంతరం 278మంది వృద్ధాప్య పింఛను మంజూరు పత్రాలను మత్స్యకారులకు మల్లాడి, ఎమ్మెల్యే గొల్లపల్లి అందజేశారు.

మాజీ అనడం సరికాదు

పింఛన్ల పంపిణీ సభలో ఎమ్మెల్యే గొల్లపల్లి మాట్లాడుతూ మల్లాడిని ఉద్దేశించి మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే అని వ్యాఖ్యానించారు. గవర్నర్ ఆమోదంతో కేబినెట్ హోదా గల ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి పదవి గల తనను మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేని ప్రస్తావించడంతో సభాముఖంగా మల్లాడి చురకలు వేశారు. ఇంకోసారి మాజీ మంత్రి, మాజీఎమ్మెల్యే అంటే తాను వేరే విధంగా పిలవాల్సి ఉంటుందని మల్లాడి చురకలు వేయడం సభలో కొంతసేపు గందరగోళం నెలకొంది.

ఏజీపీగా జీపీ నాయుడు

కొత్తపేట, మే 21(ఆంధ్రజ్యోతి): కొత్తపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా కొత్తపేటకు చెందిన న్యాయవాది గాలిదేవర పులయ్యానాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ లా సెక్రటరీ జి.ప్రతిభాదేవి ఉత్తర్వులు జారీ చేశారు.

వెంకన్న ఆదాయం రూ.3.58లక్షలు

ఆత్రేయపురం, మే 21(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,58,649 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో సూర్యచక్రధరరావు తెలిపారు.

జోరు వాన

రావులపాలెం, మే 21(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలంలో విడతవిడతలుగా ఎడతెరిపిలేని వర్షం కురవడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ, 12గంటల నుండి 2 గంటల వరకూ కుండపోతగా వర్షం కురిసింది. రైతులు పంట పొలాలకు వెళ్లే కాలువగట్లు బురదమయంగా మారాయి. రహదారుల చెంతన పల్లపు ప్రాంతాల్లోకి వర్షపునీరు చేరింది. వర్షం కారణంగా కొంత మేర వ్యాపార కూడలిల వద్దకు వచ్చే ప్రజలు కొంత మేర తగ్గడంతో వ్యాపార సముదాయాలు ఆ సమయంలో ఖాళీగా దర్శనమిచ్చాయి.

శిథిలస్థితికి చేరిన అవుట్‌ఫాల్ స్లూయిస్

- స్లూయిస్‌పై పలు ప్రమాదాలు..
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు
- ప్రతిపాదనలు సిద్ధంచేసిన వైనం


ధ్వంసమైన స్లూయిస్ తలుపులు



ఆదుర్రులో శిథిలస్థితికి చేరిన అవుట్‌ఫాల్ స్లూయిస్, రేయిలింగ్ విరిగిపోవడంతో ప్రమాదకరంగా

మామిడికుదురు, మే 21(ఆంధ్రజ్యోతి): ఆదుర్రు గ్రామంలోని వాడబోధి డ్రెయిన్‌పై ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిస్ శిథిలస్థితికి చేరి ప్రమాదకరంగా ఉంది. స్లూయిస్‌కు ఏర్పాటుచేసిన తలుపులు ధ్వంసమై మురుగునీరు దిగడానికి ఇబ్బందికరంగా మారింది. స్లూయిస్‌పై ఉన్న రెయిలింగ్ విరిగిపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెయిలింగ్ విరిగిపోవడంతో ట్రాక్టర్లు స్లూయిస్ పై నుంచి పడిన సంఘటనలు ఉన్నాయి. వర్షాకాలంలో మురుగునీరు దిగడానికి ఈస్లూయిస్ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. స్లూయిస్ తలుపులు విరిగిపోయి, గోడలు బీటలు వారి శిథిలస్థితికి చేరడంతో వరదల సమయంలో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈస్లూయిస్‌పై రైతులు, మత్స్యకారులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. దీనిపై సంబంధిత హెడ్‌వర్క్స్ ఏఈ టీవీఎల్ఎన్ మూర్తిని వివరణ కోరగా స్లూయిస్ నిర్మాణం కోసం రూ.4.54కోట్లతో ప్రతిపాదనలు చేశామని, అవి ప్రస్తుతం టెండరు దశలో ఉన్నాయని తెలిపారు. వర్షాకాలం, వరదల సమయంలో ఈస్లూయిస్ కూలిపోతుందేమోనన్న భయాందోళనతో గడపాల్సి వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విరిగిపోయిన రెయిలింగ్ స్థానంలో అధికారులు ఇటీవల ఇసుక మూటలతో రక్షణ చర్యలు చేపట్టారు. త్వరలో ఈస్లూయిస్ నిర్మాణం చేసి కష్టాలను గట్టెక్కించాలని రైతులు కోరుతున్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

హాజరైన రాజకీయ ప్రముఖులు


టీడీపీ నాయకులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ

అమలాపురం, మే 21(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలోని కోనసీమ మహాశాస్త అయ్యప్పస్వామి ఆలయం వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగాయి. ఈదరపల్లిలో ఉన్న అయ్యప్పస్వామి 18వ వార్షికోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో ఉదయం నుంచి పంచామృతాల అభిషేకం, పుష్పాలంకరణ, నవగ్రమ హోమాలు వంటి అనేక పూజా కార్యక్రమాలు అయ్యప్పస్వామి భక్తులు కీర్తనల మధ్య వైభవంగా జరిగాయి. ఈసందర్భంగా ఆలయంలో శ్రీమేధా దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ, చాగంటి వరప్రసాద్ దంపతులతో వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణచేశారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు, లారీ యూనియన్‌కు చెందిన వాకపల్లి పెద్దకాపుతో పాటు పలువురు నేతలు అయ్యప్పస్వామిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వీరిని ఆలయ కమిటీ తరపున స్వాగతం పలికారు. నల్లా చిట్టిబాబు, మోరం దొరబాబు, రామాయణం వెంకటేశ్వరరావు, కోన వెంకట్, సంగినీడి గణేష్, అడపా శివరామ్, బండారు గంగాధరం పాల్గొన్నారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు అమలాపురంలో అన్నక్యాంటీన్ ప్రారంభం



ప్రారంభానికి ముస్తాబైన అన్నక్యాంటీన్

అమలాపురం, మే 21(ఆంధ్రజ్యోతి): అమలాపురం మున్సిపల్ కార్యాలయానికి సమీపంలో అన్నక్యాంటీనును గురువారం ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో అన్నక్యాంటీన్‌ను వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు గురువారం మధ్యాహ్నం ప్రారంభిస్తారని సమాచారం. కార్యక్రమంలో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ హరీష్‌మాధుర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులతో పాటు టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనున్నాయి. బుధవారం అన్నక్యాంటీను ప్రారంభోత్సవ ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ కేవీవీఆర్ రాజు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీల ఆధ్వర్యంలో అధికారులు, టీడీపీ పార్టీ నాయకులు పరిశీలించారు.

పహల్గాం ఘటనలో ఉగ్రవాదులను ఎందుకు పట్టుకోలేదు

ఏఐసీసీ ఆహ్వానకమిటీ సభ్యుడు గిడుగు

అమలాపురం, మే 21(ఆంధ్రజ్యోతి): దేశంలో ఉగ్రవాదం పెచ్చరిల్లుతుందని పెహల్గాంలో జరిగిన దారుణ ఘటనకు బాధ్యులైన టెర్రరిస్టులను పట్టుకోవడంలో ప్రధానమంత్రి మోదీ వైఫల్యం చెందారని పీసీసీ మాజీ అధ్యక్షుడు, ఏఐసీసీ ఆహ్వానకమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. అమలాపురంలోని ఆయన స్వగృహంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్, పెహల్గాం ఘటనలపై వాస్తవాలను వివరించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టెర్రరిస్టులను పట్టుకోవడంలో వైఫల్యం చెందిన ప్రధాని మోదీ దేశ ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు చేస్తున్నారని గిడుగు ఆరోపించారు. అఖిలపక్ష ఎంపీలను విదేశీ టూర్లకు పంపించి ఉగ్రవాద చర్యలను వివిధ దేశాలకు వివరించాలన్న ప్రధాని, ముందుగా ఇక్కడ ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

రాజీవ్‌కు నివాళి


రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గిడుగు రుద్రరాజు

అమలాపురం, మే 21(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ వర్ధంతిలో భాగంగా ఆయన స్వగృహంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పలువురు నాయకులతో కలిసి ఏఐసీసీ ఆహ్వానకమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వంటెద్దు బాబి, రాష్ట్ర కాంగ్రెస్ నేత కొత్తూరి శ్రీను, యార్లగడ్డ రవీంద్ర, కుడుపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్ని నివాళులర్పించారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా పోలమ్మ చెరువుగట్టున జైబుద్ధ పార్కులో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ నాయకులు పెన్మెత్స జగ్గప్పరాజు, పాలెపు ధర్మారావు, పత్సమట్ల ఉదయభాస్కరవర్మ, వడ్డి నాగేశ్వరరావు, దివి వెంకన్నబాబు, మల్లాడి గోపి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ముమ్మిడివరం మండల శాఖ అధ్యక్షుడిగా దివివెంకన్నబాబుకు నియామక పత్రాన్ని సీనియర్ నాయకుడు పెన్మెత్స జగ్గప్పరాజు అందజేశారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని యానాం సమాచార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఫెర్రి రోడ్డులోని రాజీవ్ విగ్రహానికి పరిపాలనాధికారి మునిస్వామి, సీఐ అడలరసన్, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు, కార్యాలయ సిబ్బంది మట్టపర్తి శ్రీను, రాజు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అలాగే యానా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద రాజీవ్ చిత్రపటానికి కాంగ్రెస్ యానాం శాఖ అధ్యక్షుడు అర్దాని దినేష్, నాయకులు కాటంశెట్టి రామూర్తి, కాళ్ల ప్రసాద్, బలగం గణేష్, శ్రీను, మచ్చల శ్రీను, సతీష్, సుబ్బారావు పూలమాలలువేసి నివాళులర్పించారు.

నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి


జలవనరులశాఖ మంత్రి నిమ్మలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

మలికిపురం, మే 21(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనుల మంజూరుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి కోరారు. రాజోలు నియోజకవర్గం జిల్లాలో చివర ఉందని, ఖరీఫ్, రబీ కాలానికి రైతులకు ఇబ్బందులు కలుగకుండా పంట పొలాలకు నీటిని సరఫరా చేసేందుకు, డ్రెయిన్లు ముంపునకు గురికాకుండా సాఫీగా మురికినీరు పారుటకు పలు అభివృద్ధి పనులు మంజూరు చేయాల్సిందిగా ప్రతిపాదనలు అందజేశారు. కాల్వల నిర్వహణ కోసం 27పనులకు రూ.3.37కోట్లు, డ్రెయిన్స్ నిర్వహణ కోసం 23పనులకు రూ.2కోట్లు మంజూరు చేయాలని అంచనాలతో ప్రతిపాదనలు అందజేశారు. మంత్రి రామానాయుడు రాజోలు నియోజకవర్గానికి రావాల్సిందిగా మర్యాద పూర్వకంగా ఆహ్వానించారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారు. ఎమ్మెల్యే దేవతో పాటు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీను, రాజోలు డీసీ పినిశెట్టి బుజ్జి, చాగంటి స్వామి, అడబాల యుగంధర్ ఉన్నారు.

హనుమాన్ జన్మదినోత్సవం



ముమ్మిడివరం, మే 21(ఆంధ్రజ్యోతి): ఆంజనేయ స్వామిజన్మదినోత్సవం సందర్భంగా స్థానిక పోలమ్మ చెరువుగట్టున ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో గురువారంనుంచి నాలుగు రోజులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు అర్చకుడు సుదర్శనంశ్రీరామ చిరంజీవాచార్యులు తెలిపారు. గురువారం ఉదయం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, పంచామృత మండపారాధన, కుంభపూజ, అభిషేకం, తమలపాకుల పూజ, సింధూరార్చన, శాంతిహోమం, పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పం, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సాయంత్రం శ్రీరామరక్షా స్తోత్రం, హనుమాన్‌చాలీసా పారాయణ, శుక్రవారం సాయంత్రం కోలాటం, శనివారం ఉదయం నుంచి భజన ఏకాహం, ఆదివారం శోభాయాత్ర జరుగుతాయని అర్చకుడు చిరంజీవాచార్యులు తెలిపారు. వివరాలకు 9989203681 నెంబరును సంప్రదించాలన్నారు.

హనుమాన్ పుట్టినరోజుకు ఏర్పాట్లు

అంతర్వేది, మే 21(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సఖినేటిపల్లి మండలంలో రామాలయాలు, హనుమాన్ మందిరాల్లో భారీ ఏర్పాట్లు చేశారు. పందిళ్లువేసి ఆలయాలను పుష్పాలంకరణ, విద్యుత్ అలంకరణతో ముస్తాబు చేశారు. మోరి సుబ్బారాయుడు కాల్వగట్టు వద్ద ప్రసన్నాంజయనేయస్వామి ఆలయ 39వ వార్షికోత్సవంలో భాగంగా ఐదు రోజులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అంతర్వేది, సఖినేటిపల్లి, టేకిశెట్టిపాలెం, కేశవదాసుపాలెం తదితర గ్రామాల్లో హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా ఏర్పాట్లు చేశారు.

వీఆర్ఏ వరదయ్య మృతి



ఐ.పోలవరం, మే21(ఆంధ్రజ్యోతి): ఎదురులంక వీఆర్ఏ దార్ల వరదయ్య(74) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. వీఆర్ఏగా వరదయ్య 47ఏళ్లు సేవలందించారు. తహశీల్దార్ సీహెచ్ విజయశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ మహాలక్ష్మీనాయుడు, సిబ్బంది సంతాపం తెలిపారు.

తిరంగా ర్యాలీ



సఖినేటిపల్లి సెంటర్‌లో ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

అంతర్వేది, మే 21(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిలో ఆపరేషన్ సిందూర్ విజయంతో త్రివిధ దళాలకు సంఘీభావంగా బీజేపీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. బుధవారం భారీ త్రివర్ణ పతకాలతో బీజేపీ నాయకులు, గ్రామస్తులు సఖినేటిపల్లి సెంటర్ నుంచి స్టేట్ బ్యాంకు వరకు ర్యాలీ చేశారు. భారత్ మాతాకీ జై.. జై జవాన్.. అంటూ నినాదాలు చేశారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, బీజేపీ రాష్ట్ర మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రధాని మోదీ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో బోనం నాయుడు, ఇందుకూరి సుబ్బరాజు, కాళ్లకూరి సతీష్, మల్లాడి స్వామి, భీమనాథం సత్యనారాయణ, ప్రసాద్, రాజబాబు, గొల్లమందల శ్యామసుందరరావు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సాయిరామ్ విద్యానికేతన్‌కు అవార్డు

ఐ.పోలవరం, మే 21(ఆంధ్రజ్యోతి): గుత్తెనదీవి సాయిరామ్ విద్యా నికేతన్‌లో మూడేళ్ల నుంచి లీడ్ ఇంటర్నేషనల్ కరిక్యులమ్‌ను అన్ని తరగతి గదుల్లో సాంకేతికతను జోడించి ట్యాబ్, స్మార్ట్ టీవీతో అనుసంధానం చేసి విద్యాబోధన చేస్తున్నారు. దీంతో స్టేట్ లీడ్ అకడమిక్ సంస్థ సాయిరామ్ విద్యానికేతన్‌కు బెస్ట్ స్కూల్ అవార్డును అందించింది. స్టేట్ లీడ్ అకడమిక్ అడ్వైజర్ లక్ష్మణ్ వారణాసి, సీనియర్ అక్కౌంట్ మేనేజర్ మోహన్ యాంద్ర, స్కూల్ కరస్పాండెంట్ సలాది శ్రీనివాసరావుకు అవార్డు అందించారు. ప్రిన్సిపాల్ మాగాపు సీతారత్నం, లీడ్ స్కూల్ అకడమిక్ కో ఆర్డినేటర్ నాటి ధనరాజు, స్కూల్ క్యాంపస్ ఇన్‌చార్జి బొమ్మిడి నాగేంద్రవర్మ, స్టేట్ కస్టమర్ సక్సెస్ మేనేజర్ గవర ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

వానపల్లి పల్లాలమ్మకు మాధవ్ పూజలు

కొత్తపేట, మే 21(ఆంధ్రజ్యోతి): వానపల్లి గ్రామదేవత పల్లాలమ్మ అమ్మవారిని బుధవారం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందరావుతో కలిసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయంలో కీలకపాత్ర పోషించిన సైనికుల శ్రేయస్సు కోరుతూ పూజలు చేశామన్నారు. బీజేపీ నాయకులు గొలకోటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండపేట



ఆలమూరులో మురుగునీటి డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ప్రజల సమస్యపై అధికారుల దృష్టి

ఆలమూరు, మే 21(ఆంధ్రజ్యోతి): మురుగు నీటి డ్రెయిన్ల క్లీనింగ్‌పై ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్టు ఎంపీడీవో ఎ.రాజు అన్నారు. ఆలమూరు మత్స్యకార కాలనీలో ఉన్న డ్రెయిన్ చెత్తతో మూసుకుపోవడంతో వారు పడుతున్న ఇబ్బందులను గుర్తించి దాన్ని శుభ్రం చేసే పనిని బుధవారం ప్రారంభించారు. అక్కడ జరుగుతున్న పనులను ఎంపీడీవో ఎ.రాజు, చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్, ఆలమూరు పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి శ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం ఆల మూరు సిద్దార్థ హైస్కూల్ నుంచి వచ్చే డ్రెయిన్ దిగువకు వెళ్లకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ముఖ్యంగా పంచాయతీ డ్రైనేజీ వాటర్ కూడా ఇదే కాలువ ద్వారా వెళ్లవలసి ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, ఎఎంసీ మాజీ చైర్మన్ ఈదల నల్లబాబు, జనసేన నాయకుడు బైరిశెట్టి రాంబాబు తదితరులు ఎంపీడీవో దృష్టికి తీసుకొచ్చారు. తదుపరి పంచాయతీ సిబ్బందితో గ్రామంలోని మంచినీటి ట్యాంక్‌లను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాలో సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అసంపూర్తి భవనాల పరిశీలన

కె.గంగవరం, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు ప్రారంభించి అసంపూర్తిగా ఉన్న భవనాల వివరాలు నమోదు చేస్తున్నామని ఆర్‌ఐ ఎస్. వెంకట్రావు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న రైతుసేవా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, మిల్క్ బల్క్ యూనిట్లను పరిశీలించారు. వాటి నిర్మాణ దశలను ఆయన నమోదు చేసుకున్నారు. అసలు ప్రారంభం కాని భవనాల వివరాలు సేకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో పరిశీలిస్తున్నామని వీటి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆయన వెంట వీఆర్‌వో పామర్తి రామారావు, వీపీఏ గణేష్ ఉన్నారు.



పామర్రులో రైతు సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఐ వెంకట్రావు



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజల్లో పాల్గొన్న భక్తజనం

వెంకన్న ఆదాయం రూ.3.58 లక్షలు

ఆత్రేయపురం, మే 21(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తజనం అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.3,58,649 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

వెంకన్న ఆలయంలో రాజసభ సభ్యుడి పూజలు: వాడపల్లి ఆలయంలో బుధవారం రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. రాజ్యసభ సభ్యుడి హోదాలో తొలిసారిగా ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చక బృందం స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం వేదాశీర్వచనం తీసు కున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు.



చెల్లూరులో పంటబోదెను పరిశీలిస్తున్న అధికారులు

పంటబోదెను పరిశీలించిన అధికారులు

రాయవరం, మే 21(ఆంధ్రజ్యోతి): పంట బోదెలో డ్రైనేజీ వ్యర్థాలు చేరడంతో పంటలు పండక ఇబ్బందులు పడుతున్నామని ఇటీవల రైతులు నిరసన తెలిపిన నేపథ్యంలో బుధవారం చెల్లూరులోని పంటబోదెను అధికారులు పరిశీలించారు. తహశీల్దారు ఐవీ శెట్టి, ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన, ఇరిగేషన్ ఏఈ సుబ్బారావు తదితరులు పంటబోదెను పరిశీలించారు. మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు మాట్లాడుతూ ఇళ్లలోని వాడకం నీటిని పంట బోదెలోకి మళ్లించడం ద్వారా దానిపై ఆధారపడ్డ సుమారు వంద ఎకరాల ఆయకట్టు రైతాంగం పంటలు పండక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంటబోదెను పరిశీలించిన అధికారులు డ్రెయిన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్టు రైతులకు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బొల్లంరెడ్డి పట్టాభిరామన్న, గొడితి చిన్న తదితరులతో పాటు పంచాయతీ కార్యదర్శి కె.రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల తదితరులు పాల్గొన్నారు.



కేశవరంలో హైస్కూల్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి సలీం

హైస్కూల్ ప్రహరీ నిర్మాణానికి చర్యలు

మండపేట, మే 21(ఆంధ్రజ్యోతి): కేశవరంలో వున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా బుధవారం సందర్శించారు. పాఠశాలకు సంబంధించిన సమాచారాన్ని మండల విద్యాధికారి సోమిరెడ్డి, హెచ్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రహరీ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సర్వశిక్షాభియాన్ అధికారిని ఆయన ఆదేశించారు. మధ్యలో నిలిచిపోయిన పాఠశాల భవనం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఆయన వెంట మండల విద్యాధికారి చింతా సోమిరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం తదితరులు వున్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

అంబాజీపేట, మే 21(ఆంధ్రజ్యోతి): పురుగు మందు తాగి ఒక వ్యక్తి మృతి చెందాడు. అంబాజీపేటకు చెందిన రంకిరెడ్డి సింహాద్రి(40) సమస్యలతో మనస్థాపానికి గురై 20న మొసలపల్లి శివారు కొబ్బరి తోటల్లో పురుగు మందు తాగాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో అతడ్ని అమలాపురం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.చిరంజీవి తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో ఉన్న కరాచీ సెంటరులో వున్న అంజనేయస్వామివారు

హనుమత్ జయంతి వేడుకలకు ఆలయాల ముస్తాబు

మండపేట, మే 21(ఆంధ్రజ్యోతి): హనుమత్ జయంతి కోసం హనుమాన్ ఆలయాలు ముస్తాబయ్యాయి. గురువారం స్వామివారి జయంతి నేపథ్యంలో మండపేటలోని అంజనేయస్వామి ఆలయంలో జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, హనుమత్‌వ్రతాలు నిర్వహిస్తున్నట్టు అర్చకుడు ఖండవిల్లి పవన్‌కూమార్ తెలిపారు. స్వామివారి జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. మండపేటతోపాటు, రూరల్ ప్రాంతాల్లో కూడా స్వామివారి జయంతి వేడుకలకు ఆయా ఆలయాలు ముస్తాబయ్యాయి.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కొత్తపేట, మే 21(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం అవిడి రేవు సమీపంలో పంట కాలువ లాకుల వద్ద ఒకవ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. అవిడి పెదపేటకు చెందిన నామాడి సుధాకర్(40) గ్రామంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభలో పాల్గొని ఆ తర్వాత ఇంటికి రాలేదన్నారు. కుటుంబ సభ్యులు గాలించగా లాకుల సమీపంలో మృతి చెంది ఉండటాన్ని గుర్తించి సమాచారం ఇచ్చారన్నారు. వారిచ్చిన సమాచారంతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నట్టు తెలిపారు. అతని సోదరుడు నామాడి రవి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హెచ్‌ఐవీపై అవగాహన

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 21 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలో ముచ్చుమిల్లి రాజీవ్ గృహకల్ప వద్ద బుధవారం హెచ్‌ఐవిపై అవగాహన కల్పిస్తూ కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో వీధి నాటకం ద్వారా హెచ్‌ఐవి ఎలా వస్తుందో వివరించారు. కండోమ్ వాడకంతో కలిగే ఉపయోగాలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఆర్‌సీ కౌన్సిలరు నాగన్న, జన కల్యాణ్ వెల్ఫేర్ స్వచ్ఛంద సేవా సంస్థ దొరబాబు, లక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పీ సింధు, ఆశావర్కర్లు, రాజీవ్‌గృహకల్ప వాసులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దృశ్యం

ట్రాన్స్‌ఫార్మర్ చోరీలతో రైతుల కలవరం

ఆలమూరు, మే 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉండే రాగివైరు కోసం రూ.లక్షల విలువైన ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేస్తున్న దొంగలు ఇటీవల పెరిగిపోతున్నారు. మంగళవారం రాత్రి ఆలమూరు ఏటిగట్టు సమీపంలోని జొన్నాడకు చెందిన రైతు నాగేంద్ర పంటభూమిలో ఉన్న రూ.2.5 లక్షల విలువైన ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగివైరును దొంగిలించినట్టు ట్రాన్స్‌కో సిబ్బంది తెలిపారు. రాగివైరు అమ్మకం ద్వారా వారికి నాలుగైదు వేలు మాత్రమే వస్తుందని, లక్షల విలువైన కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌ను రాగివైరు కోసం ధ్వంసం చేయడంపై విద్యుత్‌శాఖ సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు అమలాపురంలో అన్న క్యాంటీన్ ప్రారంభం

అమలాపురం, మే 21(ఆంధ్రజ్యోతి): అమలాపురం మున్సిపల్ కార్యాలయానికి సమీపంలో అన్న క్యాంటీనును గురువారం ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో అన్నక్యాంటీన్‌ను వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు గురువారం మధ్యాహ్నం ప్రారంభిస్తారని సమాచారం. కార్యక్రమంలో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ హరీష్‌మాధుర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులతో పాటు టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనున్నాయి. బుధవారం అన్నక్యాంటీను ప్రారంభోత్సవ ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ కే వీవీఆర్ రాజు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీల ఆధ్వర్యంలో అధికారులు, టీడీపీ పార్టీ నాయకులు పరిశీలించారు.

ఏజీపీగా జీపీ నాయుడు

కొత్తపేట, మే 21(ఆంధ్రజ్యోతి): కొత్తపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా కొత్తపేటకు చెందిన న్యాయవాది గాలిదేవర పులయ్యనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ లా సెక్రటరీ జి.ప్రతిభాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన మూడేళ్లు ఏజీగా కొనసాగనున్నారు. ఈయన్ను పలువురు న్యాయవాదులు అభినందించారు.



కేశవరంలో రైల్వే గేటు వద్ద నిలిచిన ట్రాఫిక్

కేశవరం ఆర్వోబీ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

మండపేట, మే 21(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం కేశవరంలో రైల్వే ఫ్లైఓవర్ వంతెన నిర్మాణానికి రంగం సిద్ధం అయింది. ఇప్పటికే రైల్వేశాఖ, రెవెన్యూ, రహదారులు భవనాల శాఖ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. రామచంద్రపురం ఆర్డీవో అఖిల వంతెన నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ కోసం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పుడు రైల్వేగేటు వద్ద కాకుండా గేటుకు కూతవేటు దూరంలో కడియం వైపు ఉన్న భూములు వంతెన నిర్మాణం కోసం సేకరించాల్సి ఉంటుందని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే భూసేకరణ జరిగినప్పటికీ జరిగిన మార్పు నేపథ్యంలో మరోసారి భూసేకరణ చేయాల్సి ఉంటుంది. వంతెన నిర్మాణం జరిగితే ట్రాఫిక్ ఇబ్బందులు తొలగినట్లేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కేశవరంతోపాటు, జెడ్.మేడపాడు గ్రామాల్లో రైల్వే వంతెనలు నిర్మించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఇప్పటికే పలుసార్లు రైల్వే అధికారులతో పాటు, రెవెన్యూ, రహదారులు భవనాలశాఖ అధికారులు భూసేకరణ, వంతెన నిర్మాణ ప్రాంతాలను పరిశీలించారు. వంతెనలు పూర్తయితే రైల్వేగేట్ల వద్ద ట్రాఫిక్ కష్టాలు దూరం అయినట్లేనని స్థానికులు అంటున్నారు. ముఖ్యంగా కేశవరం రైల్వే వంతెన పూర్తయితే రామచంద్రపురం, మండపేట, యానాం, అనపర్తివాసులకు రాజమహేంద్రవరం మరింత చేరువ కానుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



వానపల్లి పల్లాలమ్మను దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవ్

వానపల్లి పల్లాలమ్మకు మాధవ్ పూజలు

కొత్తపేట, మే 21(ఆంధ్రజ్యోతి): వానపల్లి గ్రామదేవత పల్లాలమ్మ అమ్మవారిని బుధవారం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీవీఎన్ మాధవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందరావుతో కలిసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయంలో కీలకపాత్ర పోషించిన సైనికుల శ్రేయస్సు కోరుతూ పూజలు చేశామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గొలకోటి వెంకటేశ్వరరావు, పాలూరి జయప్రకాష్‌నారాయణ, నూకల వీరన్న, కంచుస్తంబం శ్రీనివాసరావు, బళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు అదనపు వసతులకు చర్యలు

మండపేట, మే 21(ఆంధ్రజ్యోతి): మండపేట ఏడిద రోడ్డులో వున్న అన్న క్యాంటీన్‌కు అదనంగా నిర్మించే షెడ్డు స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వ అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు బుధవారం పరిశీలించారు. అన్న క్యాంటీన్ చెంతనే వున్న ఖాళీ స్థలంలో షెడ్డు నిర్మాణానికి సంబంధించి పలు అంశాలపై మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో ఆయన మాట్లాడారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో క్యాంటీన్‌కు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు పలు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఇక్కడ షెడ్డు నిర్మాణం అవసరం నేపథ్యంలో ఎమ్మెల్యే వేగుళ్ల స్థలాన్ని పరిశీలించి నిర్మాణ వ్యయం అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ శ్రీనివాస్ తదితరులు వున్నారు.



అన్న క్యాంటీన్‌లో నిర్మించే షెడ్డు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలపై పోటీలు

రాయవరం, మే 21(ఆంధ్రజ్యోతి): వెదురుపాక గ్రామంలో గీతా మందిరం 27వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువు సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉదయం నుంచి శ్రీకృష్ణుడికి కుంకుమార్చనలు, హారతులు, గ్రామోత్సవం నిర్వహించారు. భగవద్గీత 18 అధ్యాయాల పారాయణం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సత్యవాడ, చెల్లూరు గీతాశ్రమ నిర్వాహకులు పోలిశెట్టి వెంకట్రావు, అనుసూరి నాగేశ్వరరావు, ఆధ్యాత్మికవేత్త వైట్ల సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ మనిషి ఎలా జీవించాలో భగవద్గీత చూపిందన్నారు. అనంతరం చిన్నారులకు భగవద్గీత శ్లోకాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం అన్నసమారాధన జరిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెదురుపాక గ్రామానికి చెందిన నల్లమిల్లి వీరరాఘవరెడ్డి, కోన బాపిరాజు కుటుంబాలకు డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి, వరలక్ష్మి దంపతుల వితరణతో ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పడాల శివ మణికంఠ రెడ్డి, నాగులాపల్లి వీరవెంకట సత్యనారాయణ, వెదురుపాక, కొంకుదురు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

మండపేట అర్బన్, రూరల్‌కు నూతన అధ్యక్షుల నియామకం

మండపేట, మే 21(ఆంధ్రజ్యోతి): మండపేట రూరల్, మండపేట, పట్టణ టీడీపీ పట్టణ నూతన అధ్యక్షులను నియమించారు. మండపేట రూరల్ టీడీపీ అధ్యక్షుడిగా కేశవరం గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ అధ్యక్షుడు కర్రి తాతారావు, పట్టణ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మచ్చా నాగులు నియమితులయ్యారు. నూతన అధ్యక్షులుగా నియమితులైన రూరల్, అర్బన్ అధ్యక్షులు కర్రి తాతారావు, మచ్చా నాగు వేర్వేరుగా ఎమ్మెల్యే వేగుళ్లను టీడీపీ కార్యాలయంలో బుధవారం వారి అనుచరులతో కలిశారు. తమకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



ఏడిదలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

మండపేట, మే 21(ఆంధ్రజ్యోతి): దేశానికి ఐటీ రంగాన్ని తీసుకు వచ్చిన ఘనత మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీకే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. బుధవారం ఏడిద గ్రామంలో వున్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పి.సత్యనారాయణ, జి.రామచంద్రరావు, ఎం.శ్రీను, సత్యనారాయణ, సద్గురు తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షం

రావులపాలెం, మే 21(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలంలో పలు విడతలుగా ఎడతెరిపిలేని వర్షం కురవడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి పలు దఫాలుగా కుండపోతగా వర్షం కురిసింది. పంట పొలాలకు వెళ్లే రైతుల కాలువగట్లు బురదగా మారాయి. రహదారుల చెంతన పల్లపు ప్రాంతాల్లోకి వర్షపునీరు చేరింది. వర్షం కారణంగా వ్యాపార సముదాయాలు ఖాళీగా దర్శనమిచ్చాయి.